





శ్రీ ఉపమాక క్షేత్రంలో గరుడాద్రిపై శిలారూపంలో వెలసియున్న

శ్రీమహాలక్ష్మీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి మూలవిరాట్ ఊహాచిత్రం.

శ్రీరస్తు　　　శుభమస్తు　　　అవిఘ్నమస్తు

# శ్రీ ఉపమాక క్షేత్ర మాహాత్మ్యము



సంకలనం :

తిమ్మరాజు విశ్వపతి రామకృష్ణమూర్తి

**శ్రీశ్రీశ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం-ఉపమాక క్షేత్రం**

ఉపమాక గ్రామం, నక్కపల్లి మండలం, విశాఖపట్టణం జిల్లా, ఆంధ్రప్రదేశ్.

**ఫోన్ : 92476 20111**

**www.upamakabalaji.com / org.in**



శ్రీ ఉపమాక క్షేత్ర మాహాత్మ్యము

## Sri Upamaka Kshetra Mahatmayam

© Copyrights reserved.

First Edition : 2007 ( 2000 Copies )
Second Edition : 2009 ( 3500 Copies )

Author : Thimmaraju Viswapathi Rama Krishnamurthy

**Price : 20/-**

Published by :
**DEVI CHARITABLE FOUNDATION**
Avvari Street, Nakkapalli - 531 081,
Visakhapatnam Dist,
Andhra Pradesh, INDIA.
Ph : 08931-227010 / Cell : 99660 90731

**For Copies:**
**Sri Sri Sri Venkateswara Swami Vari Devastanam,**
**Upamaka Kshethram (Temple), Upamka Village,**
**Nakkapalli Mandal, Visakhapatnam Dist - 531 081, (A.P).**
**Phone: +91-92476 20111**
**Website: www.upamakabalaji.com / org.in**
**E-mail : upamakabalaji@gmail.com**

**Designed by :**
**SRI VASAVI GRAPHICS & SWAMY DIGITALS**

**Printed at : CHAKRAVARTHY ARTS & GRAPHICS**
13-1-30, Main Road, ANAKAPALLE
Mobile : 98482 78210



## కీర్తి శేషులు శ్రీ రాజా సాగి సూర్యనారాయణ రాజు గారు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వములో అటవీశాఖా మాత్యులుగా, దేవాదాయ-ధర్మాదాయ శాఖా మాత్యులుగా పనిచేసిన తంగేడు వాస్తవ్యులు కీర్తి శేషులు శ్రీ రాజాసాగి సూర్యనారాయణ రాజు గారు సుమారు 1970 సం॥ నుండి 1975 సం॥ మధ్యకాలమునందు ఈ క్షేత్రము అభివృద్ధికి ఎంతో కృషి చేసినారు. వీరి కృషి ఫలితంగా శ్రీశ్రీశ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ పునర్నిర్మాణము, ఆలయమునందు బేడా మండపము, కొండపైన మండప నిర్మాణము, రాజగోపురము, ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ మొదలగు పనులు జరిగినవి.





# నివేదన

శ్రీమన్నారాయణుడు భక్త సులభుడు. ఆ స్వామి కలియుగ వైకుంఠమైన తిరుమలలో శ్రీ వేంకటేశ్వరునిగా వెలసి భక్తులచేత నిత్య పూజలందుకుంటున్నాడు. కలియుగ ప్రత్యక్షదైవమైన ఆ వేంకటేశ్వరుడు భక్తులను అనుగ్రహించడానికై ఎన్నో దివ్య క్షేత్రాలలో అనేక రూపాలలో వెలిసినాడు. ఆ కోవలోని దివ్యక్షేత్రాలలో ఒకటి ఈ ఉపమాక దివ్య ప్రదేశం. పూర్వకాలంలో ఈ క్షేత్రం నిత్యం భక్తులతో కళకళలాడుతుండేది. నిత్యోత్సవాలు, మాసోత్సవాలు, సంవత్సరోత్సవాలు వైభవంగా జరుగుతుండేవి. ఈ ఆలయం నిత్య కళ్యాణం పచ్చతోరణంగా విరాజిల్లేది.

ఇక్కడ వెలసిన శ్రీ వేంకటేశ్వరుడు అత్యంత మహిమాన్వితుడు. ఈ స్వామిని తరతరాలుగా ఎందరో భక్తులు ఎన్నో విధాల సేవించి తరించారు. ఇప్పటికీ ప్రతి సంవత్సరం ఎన్నో ఉత్సవాలలో లక్షలాది భక్తులు పాల్గొని స్వామిని సేవించి, శ్రీ స్వామివారి అనుగ్రహానికి పాత్రులవుతున్నారు.

ఇక్కడ శ్రీ స్వామివారి క్షేత్రం గురించి ప్రాధాన్యతను, క్షేత్రమహిమనూ తెలిపే పుస్తకాలు ప్రస్తుతం అందుబాటులో లేవు. కొన్ని సంవత్సరాల క్రితం కొందరు మహానుభావులచే రచించబడ్డ ఈ దివ్య క్షేత్ర పుస్తకాలు పూర్తిగా మరుగున పడ్డాయి. ఈ క్షేత్రం యొక్క దివ్యవైభవాన్ని తెలుసుకుంటే మనకి ఇంకా ఆనందం కలుగుతుంది.

ఇంతటి దివ్యక్షేత్రం గురించి పుస్తకం రాసే భాగ్యం కలగడం నా పూర్వజన్మ పుణ్యఫలంగా భావిస్తున్నాను. ఇదంతా ఆ స్వామివారి అనుగ్రహం తప్ప మరొకటి కాదు.

ఈ పుస్తకం రాసేటప్పుడు నాకు ఎందరో మహానుభావుల రచనలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. బ్రహ్మశ్రీ బులుసు పాపయ్యశాస్త్రిగారు, శ్రీమాన్ పరవస్తు వేంకట రంగనాథస్వామిగారు, బ్రహ్మశ్రీ కాకరపర్తి సీతారామశాస్త్రులు గారు, బ్రహ్మశ్రీ

దేవులపల్లి సత్యారావుగారు, శ్రీమాన్ పేరివేంకట దీక్షిత కవిగార్ల గ్రంథాలు ఈ రచనకి ఎంతో తోడ్పడ్డాయి. ఈ ప్రస్తుత రచన పూర్తిగా ఈ మహానుభావుల గ్రంథాలలోని విషయాలను అనుసరించియే రాయడం జరిగింది. శ్రీ జి.ఎమ్.ఎస్. ఆర్.కె.ఎస్.వి. ప్రసాద్, ఆలయ ప్రధాన అర్చకులు, అర్చకులు – శ్రీ ఎస్. ఆర్. జె.కె. ఆచార్యులు, యస్.టి.పి.వి.యస్.ఎల్.నృసింహస్వామి మరియు డా॥ లంకా సీతారామశాస్త్రి, అనకాపల్లి వారు రచనా పరిశీలన గావించారు. మహానుభావులు, విద్వద్వరేణ్యులైన వీరందరికీ నా శతకోటి వందనాలు.

ఈ దేవాలయ చరిత్ర గురించి శాసనాత్మక ఆధారాలను అందించిన శ్రీ కొల్లూరు సూర్యనారాయణ, ఆచార్యులు, ఆంధ్రా యూనివర్సిటీ, విశాఖపట్నం వారికి శ్రీ స్వామి అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నాను.

ఈ పుస్తకమునకు అద్భుతముగా బొమ్మలు గీసిన శ్రీ కె.వి. భీమారావు, హైదరాబాదు వారికి, ఫోటోస్ సమకూర్చిన స్టూడియో ఆచార్య మరియు స్వామి డిజిటల్స్ వారికి శ్రీస్వామి వారి అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థిస్తున్నాను.

అలాగే శ్రీ స్వామివారి నిత్యపూజలతో, దేవాలయ నిర్వహణలో నిత్యం తరిస్తున్న దేవస్థానం ఇ.ఓ. శ్రీ బేతి కోటేశ్వరరావు గారికి, ఛైర్మెన్ శ్రీ కొప్పిశెట్టి కొండబాబు గారికి, కార్యవర్గ సభ్యులకు, సిబ్బందికి, అర్చకులకు శ్రీ స్వామివారి అనుగ్రహం ఎల్లప్పుడు ఉండాలని మనసార ఆ స్వామిని ప్రార్థిస్తున్నాను.

భక్తులందరికీ చదువుకొనడానికి వీలుగా చాలా సులభతరమైన భాషలో ఈ పుస్తకం రచింపబడింది. ఈ పుస్తకం ఆ స్వామివారి దయవలన భక్తులకు ఎంతో ఉపయోగకారిగా ఉండగలదని నా నమ్మకం.

ఈ రచనలో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆ శ్రీలక్ష్మీ శ్రీనివాసుల కరుణా కటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని ప్రార్థిస్తున్నాను.

శ్రీ లక్ష్మీ శ్రీనివాస కటాక్ష సిద్ధిరస్తు!

సమస్త సన్మంగళానిభవంతు

హైదరాబాద్ — తిమ్మరాజు విశ్వపతి రామ కృష్ణమూర్తి
17-06-2009 — ఫోన్ : 9849443752





## "కలౌ వేంకటనాయకః"

శ్లో॥ ఏకేన శంఖమపరేణ కరేణ చక్రం – అన్యేన ఖడ్గ మితరేణ ధనుస్సుబాణం ।
వామేశ్రియం పరిధరం తురగాధి రూఢం – పాయాత్సమాం ఖగనగ స్థిత వేంకటేశమ్ ॥

శ్లో॥ ఏకహస్తం కటించైవ వామే శంఖం చ నిక్షిపేత్ ।
దక్షిణే చక్ర హస్తంతు ఏకం వైకుంఠ హస్తకం ।
అలర్‌మేల్‌మంగ సంయుక్తం వేంకటేశ మహంభజే ॥

ఒక చేతిలో శంఖమును, దక్షిణ హస్తమున చక్రమును, మరియొక చేతిలో ఖడ్గమును ఇతర హస్తమున ధనుర్బాణములను వామ భాగమున లక్ష్మీదేవిని ధరించి అశ్వారూఢుడై గరుడ పర్వతమున నివసించు శ్రీ వేంకటేశ్వరుడు మమ్ము కాపాడు గాక!

ఒక హస్తాన్ని కటిభాగమున నుంచి ఎడమ చేతిలో శంఖమును, కుడిచేతిలో చక్రాన్ని, నాలుగవ చేతిని అభయహస్తముగా ధరించి అలర్‌మేల్‌మంగతో కూడిన వేంకటేశ్వరుని భజింతును.

"కలౌ వేంకటనాయకః" అన్నట్లుగా, అంటే కలియుగమున శ్రీమన్నారాయణుడు కల్కి అవతారమున వేంచేస్తారు అని పురాణాలు ఘోషిస్తున్నాయి. ఇందుకు నిదర్శనం ఉపమాక వేంకటేశ్వరస్వామివారు దశావతారములలో పదవ అవతారమైన కల్కి రూపంలో ఉన్నట్లు వేంచేసి ఉంటారు. శ్రీమన్నారాయణుడు గరుత్మంతునకు గొప్ప గొప్ప ఋషేశ్వరులకు ఇచ్చిన వరప్రభావము వలన స్వామి కలియుగమున షడ్భుజములతో, శ్రీలక్ష్మీ సమేతుడై, అశ్వారూఢుడై వేంచేసారు.

అనగా ఇక్కడ వేంకటేశ్వరస్వామి ఆరు భుజములు కలిగి ఉంటారు. అందు నాలుగు హస్తములయందు దుష్టశిక్షణా శిష్టరక్షణా చేయు ఆయుధములను ధరించి, ఒక హస్తమును భక్తవత్సలుడు అను సద్గుణమునకు సంపూర్ణ అర్థమిచ్చు అభయహస్తముతోను, మరొక హస్తముతో కళ్ళెమును పట్టుకుని గుఱ్ఱము మీద కూర్చుని క్రింద వామభాగమున (ఎడమవైపున) శ్రీలక్ష్మీదేవితో కలిసి వేంచేసి ఉంటారు. ప్రపంచములోనే ఎక్కడా లేని విధముగా స్వయంభువుగా వేంచేసిన క్షేత్రం. ఉపమాక అను నామము పురాణములోనే కలదు. ఉపమాక అనగా ఉపమానము లేనిది (సాటి లేనిది) అని. ఇటువంటి క్షేత్రం ఎక్కడా ఉండదు అని అర్థం వచ్చునట్లు పురాణములోనే తెల్పిరి.

# శ్రీ మదుపమాక వేంకటేశ్వర స్తోత్రము

గీ. శ్రీ యశ్ సౌఖ్యము తేజమున్విజయమున్ । శ్రేయంబులున్గూర్చియా
ప్యాయంబొప్ప శ్రితాళి నేలెడి ప్రభుండంచు నిన్నున్ నమ్మినేఁ
జేయంబూనితి నీదు దివ్యపదరాజీవార్చనం బిట్లు దే
వా;యో వేంకటనాథ! శ్రీ మదుపమాకాద్రీశ్వరా! శ్రీధరా!

గీ. నమ్మితి నీ మహాత్మ్యమును । నమ్మితి నీ కరుణాపరత్వమున్
నమ్మితి నీ నివాసము ఘనంబును, దివ్యమునైన క్షేత్రరా
జమ్ముగ నీదు లీలలు నిజంబుగఁ గన్పడుచుండు భక్తిలో
కమ్మునకున్ నిరంతరము । కారుణికోత్తమ! వేంకటేశ్వరా!

గీ. నారదమౌని ప్రార్థన మనంబున నిల్పి దయన్ వహించి, యీ
గారుడశైలభూమి కిటుగాఁ జను దెంచితివంట నీ వహో!
శ్రీ రమణీయ వేంకటగిరి ప్రమదాలయసీమనుండి; క
న్నారఁగ నిన్నుఁజూచితి, మహాముద మొందితి శ్రీ వేంకటేశ్వరా!

గీ. భక్తితో నిన్నుఁ బ్రార్థించి । పడయరాని
యర్థ మున్నదె? నీదు భక్తాళి కహహ!
నీదు లీలలు నెవరు వర్ణింపఁగలరు?
వినతు లందుకొమ్ముపమాక వేంకటేశ!

గీ. విజయమొనగూర్చి, శాంతి సంప్రీతు లొసఁగి
కరుణతో నిన్నుఁ బ్రోవ నీ చరణములను
భక్తిఁబూజింతుఁ బద్యపుష్పములచేత
విశ్వహృదయేశ! యుపమాక । వేంకటేశ!





గీ. అగుదు వఘటనఘటనాసమర్థుం డీవ
నీదు శక్తికిఁ బారమ్ము । లేదు దేవ!
యెట్లు రక్షింతువో నన్ను । నింకమీఁదఁ
బ్రేమఁ జూపుచు నుపమాక । వేంకటేశ!

గీ. సకల శుభముల నొనగూర్చి । జయమొసంగి
మోదవారాశిలో నిత్య – మీఁదఁజేసి
భక్తులను బ్రోచుచుండు నీ । పాదసేవ
విడువ నిఁక మీద నుపమాక । వేంకటేశ!

గీ. చిత్రమౌ నీదుక్షేత్ర చరిత్ర మిపుడు
భక్తితో వ్రాసి నీ పాద । పద్మములకు
నర్పణ మొనర్చు నన్నుఁగృతార్థుఁ జేసి
ప్రీతి నేలవె యుపమాక । వేంకటేశ!

సీ. ఈప్సితంబుల నెల్ల । నీడేర్చి భక్తుల
దయతోడఁ బ్రోచు సత్ప్రభుఁడ వీవు,
నమ్మినవారికి । నగుబాటు రాకుండఁ
గంటికి ఱెప్పవై । కాతు నీవు,
అపరాధములు సైఁచి । యాశ్రితావళి నెల్ల
నిరత మేలెడు కృపా । నిధివి నీవు
స్వప్నంబులందున । సాక్షాత్కరించుచు
దయ నేలు ప్రత్యక్ష । దైవమీవు

గీ. చిత్రచిత్రంబు నీదుచరిత్ర మహహ
వర్ణనము సేయఁ దరమె నా । వంటివాని?
కఖిల జగదీశునకు నీకు । నంజలులివె
ప్రీతినందుకొమ్ముపమాక । వేంకటేశ!







# శ్రీ ఉపమాక క్షేత్ర మాహాత్మ్యము

## ప్రథమ అధ్యాయము

పూర్వకాలంలో నైమశారణ్యంలో ఒకానొక రోజు మహామునులందరు కలుసుకొని ఉపమాక దివ్యక్షేత్ర వైభవమును గురించి అనేక విషయములు తెలుసుకొనదగినవారై సూత మహామునిని ఈ క్షేత్ర మహిమ వివరింపవలసిందిగా కోరారు.

అపుడు సూతమహాముని అందులకు ఎంతో సంతోషించి "నాయనలారా! మీరు ఎంతో మంచి విషయము గురించి అడిగినారు. శ్రీమహావిష్ణువుని గురించి వర్ణించడానికన్న మించిన భాగ్యం ఏముంటుంది? అసలు అంతటి పరబ్రహ్మామూర్తిని గురించి వర్ణించడానికి వేయి నాలుకలున్న ఆ ఆదిశేషునికే వీలుకానపుడు, అతి సామాన్యుడనైన నాకు ఎలా సాధ్యమవుతుంది? ... అయినా మీరందరూ ఎంతో భక్తి శ్రద్ధలతో అడిగారు కాబట్టి నాకు తెలిసినంతలో శ్రీస్వామి వారి ఉపమాక క్షేత్ర మహాత్మ్యమును మీకు వివరిస్తాను అని ఈవిధంగా చెప్పసాగాడు.

'ఓ మహామునులరా! పూర్వకాలంలో విశ్వంలో శ్రీమన్నారాయణుడొక్కడే ఉండేవాడు. ఆ వాసుదేవుడు తన కత్యంత ప్రియురాలైన శ్రీమహాలక్ష్మితో కొన్ని వేల యుగాలు ఆనందంగా గడిపాడు. ఒకరోజున శ్రీ స్వామివారికి సృష్టిని చెయ్యాలనే తలంపు కలిగింది. అలా సంకల్పించిన వెంటనే శ్రీ స్వామివారి నాభినుండి కమలము, అందుండి బ్రహ్మదేవుడు ఉద్భవించారు. అప్పుడు ఆ బ్రహ్మ హంస రూపములో ప్రత్యక్షమైన శ్రీమన్నారాయణుల వారిని చూసి 'ఓ స్వామి! శ్రీమన్నారాయణా! నేను ఎవ్వరను? ఎక్కడి నుంచి వచ్చితిని? నా కర్తవ్యమేమిటి?' అని అడిగాడు. అప్పుడు శ్రీమహావిష్ణువు 'నాయనా! నీవు నా కుమారునివే! నీ వలన లోకములు సృష్టి చేయబడగలవు. నీకు నేను అన్ని విధాలా సహకరిస్తాను. నా అనుగ్రహంతో నువ్వు సకల సృష్టిని చేయగలుగుతావు అని బ్రహ్మ దేవునికి 'హరిఃఓమ్' అనే

మంత్రాన్ని ఉపదేశించాడు. అప్పుడు వేదవేదాంతాలన్నీ బ్రహ్మ దరిచేరాయి. అప్పుడు బ్రహ్మదేవుడు పద్నాలుగు లోకాలను సృష్టించాడు.

కొంత కాలం తర్వాత ఒకనాడు సోమకుడనే రాక్షసుడు బ్రహ్మవద్దనుంచి వేదాలన్నీ దొంగిలించి సముద్ర గర్భంలో దాక్కున్నాడు. అంతట బ్రహ్మదేవుడు శ్రీమన్నారాయణుని ప్రార్థించి 'ఓ స్వామి! నా దురదృష్టం వలన వేదాలను ఒక మహా రాక్షసుడు దొంగిలించి సముద్రగర్భంలో తిమింగిలం రూపంలో ఉన్నాడు. వానిని సంహరించి నన్ను దయచూపవలసింది అని ప్రార్థించాడు. అప్పుడు శ్రీమన్నారాయణుడు బ్రహ్మనుద్దేశించి ఇలా అన్నాడు 'ఉపదేశము లేని కారణం చేత నీవు ఈ వేదాలను కోల్పోవడం జరిగింది. లోకంలో తపస్సుకి మించిన ఉత్తమమైనది లేదు. నీవు సముద్రతీరమున ఉన్న గరుడాచలమునకు వెళ్ళి తపస్సు చేయవలసింది. ఆ ప్రదేశము అత్యంత మహిమాన్వితము. అక్కడ బంధురమనే పేరుగల సరస్సు గలదు. ఆ సరస్సులో స్నానం చేసిన ఎడల సర్వ పాపములు తొలగిపోవును. నేను నీకు షోడశాక్షరైన హయగ్రీవ మూల మంత్రమును ఉపదేశిస్తాను. ఈ మంత్రము పరమగోప్యమైనది. దీని మహిమ వేదాలకు కూడా అంతు పట్టనిది. నా అనుగ్రహాన్ని ఎంతో త్వరగా పొందడానికి ఇదే అతి తేలికమార్గము. నీవు నాకు అత్యంత ప్రీతికరుడవగుటచేత నీకీ అద్భుత మంత్ర రాజమును ఉపదేశిస్తున్నాను'. అని శ్రీమన్నారాయణులవారు బ్రహ్మదేవునికి హయగ్రీవ మంత్రమును ఉపదేశించి అంతర్ధానమయ్యెను.

అప్పుడు బ్రహ్మదేవుడు వెంటనే గరుడాచలము చేరి అక్కడ అద్భుత రమణీయ ప్రకృతి సంపదకు ఆశ్చర్యపడెను. అక్కడనున్న బంధుర సరస్సు అత్యంత శోభాయమానంగా కన్పించింది. ఆ ప్రదేశమే ఇప్పటి ఉపమాక క్షేత్రం. అతి పవిత్ర ప్రదేశం. ఈ ప్రదేశాన్ని చూసిన బ్రహ్మదేవుడు ముగ్ధుడై ఇంతటి అద్భుత మహిమాన్విత ప్రదేశాన్ని గురించి వివరించిన శ్రీమన్నారాయణునికి అనేక విధాల నమస్కరించి ఆ కొండకు ప్రదక్షిణం చేసాడు. తరువాత దివ్య సరస్సులో





స్నానమాచరించి స్వామివారు శెలవిచ్చిన హయగ్రీవ మంత్రాన్ని నూరు సంవత్సరాలు జపం చేసినాడు.

శ్రీమన్నారాయణుడు మత్స్యావతారుడై సముద్రగర్భంలో తిమింగల రూపంలో ఉన్న సోమకాసురుని సంహరించి వేదాలను రక్షించాడు.

అలా రక్షించిన వేదాలను తీసుకువచ్చి గరుడాచలంలో ఉన్న బ్రహ్మదేవుని ముందు హయగ్రీవ మూర్తిగా ప్రత్యక్షమైనాడు. ఆ స్వామిని చూచిన బ్రహ్మదేవునికి ఆనందం ఇంతా అంతా అని చెప్పనలవి కానిది. శ్రీస్వామి వారిని బ్రహ్మదేవుడు ఎన్నో విధాల స్తుతించగా అపుడు శ్రీమన్నారాయణుడు సంతోషించి వేదాలను తిరిగి ఇచ్చి ఇలా చెప్పాడు." నీవు తపమొనర్చిన ఈ దివ్యక్షేత్రము ముందు కాలములో 'ఉపమాక' అనే పేరుతో ప్రసిద్ధి కాగలదు. ఈ క్షేత్రములో చేసిన ఏ పుణ్యకార్యమైననూ వెయ్యిరెట్లు అధిక ఫలమీయగలదు. నేను ఇక్కడ ఆవిర్భవించిన ఫాల్గుణ శుద్ధ ఏకాదశినాడు ఈ సరస్సులో స్నానమాచరించి, నన్ను దర్శించినవారికి సర్వ సౌభాగ్యాలు కలుగుతాయి. ఎటువంటి అనారోగ్యము దరిచేరదు. దీర్ఘాయుష్మంతులుగా సుఖంగా జీవిస్తారు. ఈ క్షేత్రంలో గోదానం చేసినవారికి ఉత్తమ గతులు లభిస్తాయి. హిరణ్యదానం చేసిన వారికి సర్వసౌభాగ్యాలూ లభిస్తాయి. భూదానం చేసినవారికి సర్వ ఐశ్వర్యాలు లభిస్తాయి. వారి వంశంలోని పద్దెనిమిది తరాలవారూ తరిస్తారు. ' అని శ్రీమన్నారాయణులవారు అదృశ్యమైనారు. అంతట బ్రహ్మదేవుడు ఈ వేదాలను కనులకద్దుకుని తన లోకమునకు పయనమైన వాడాయెను.

ప్రథమోధ్యాయము సమాప్తము

శ్రియ: కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్ !<br>
శ్రీ ఉపమాక వాసాయ శ్రీనివాసాయ మంగళమ్







# శ్రీ ఉపమాక క్షేత్ర మాహాత్మ్యము

## ద్వితీయ అధ్యాయము

ఉపమాక క్షేత్ర మహాత్మ్యమును తెలుసుకొనిన శౌనకాది మహామునులు సూతమహామునితో ఓ స్వామి! ఈ క్షేత్రమహాత్మ్యము చాలా అద్భుతముగా ఉన్నది. ఇంతకూ ఈ క్షేత్ర విశేషములను మాయందు దయవుంచి వివరింపవలసింది అని వేడుకున్నారు. అప్పుడు సూత మహాముని ఎంతో ఆనందించి ఈ విధంగా చెప్పసాగాడు.

‘ ఓ మునోత్తములారా, శ్రీహరికి సంబంధించిన ఏ విషయములైనా వినడానికి ఎంతో ఆనందకరంగా ఉంటాయి. అంతటి అద్భుత పరబ్రహ్మమూర్తి ఆ శ్రీమన్నారాయణుడు. సాక్షాత్తు ఆ స్వామి వెలసిన ఈ ఉపమాక క్షేత్రమును గురించి మరిన్ని విశేషాలు చెప్తాను. సావధానంగా వినవలసినది. పూర్వకాలంలో దేవదానవుల మధ్య భీకరపోరు జరిగింది. ఆ పోరులో దేవతలు ఓడిపోయి తలో దిక్కు పరుగిడినారు. ఇది చూసి దేవతల తల్లియైన అదితి ఎంతో దుఃఖించి కశ్యపుని వద్దకు వెళ్ళి దేవతల దీనావస్థను వివరించి, వారిని కాపాడే ఉపాయమాలోచించమని ప్రాధేయపడిరి. అప్పుడు కశ్యపుడు బ్రహ్మవద్దకు వెళ్ళి దేవతలకు కలిగిన పరాభవాలను వివరించి వారిని రాక్షసుల నుంచి కాపాడవలసిందిగా ప్రార్థించాడు. అప్పుడు ఆ బ్రహ్మదేవుడు కశ్యపా! నీకును, నాకును, శంభున (శివున) కును కూడా అచ్చుతుడే ప్రభువు, ఆయనాజ్ఞాపించిన కార్యములొనర్చుటకు మాత్రమే మనము సమర్థులము. దైత్యులను సంహరించడానికి శ్రీహరి యొక్కడే సమర్థుడని చెప్పి దేవతలనందరిని వెంట బెట్టుకుని శ్రీమన్నారాయణుల వద్దకు చేరి ఆ స్వామిని పరి పరి విధాల స్తుతించాడు.

అప్పుడు భక్తసులభుడైన శ్రీమన్నారాయణుడు వారందరినీ ఉద్దేశించి కుశల ప్రశ్నలు వేసి ఈ రాకలో ఆంతర్యమేమిటని అడిగాడు. అప్పుడు కశ్యపుడు ఆ స్వామితో ‘ ఓ స్వామి! సర్వాంతర్యామైన నీకు తెలియనిది ఏమున్నది? దుర్మార్గులైన రాక్షసులు దేవతలను అనేక విధాల హింసించుచున్నారు. వారి బాధనుండి దేవతలను కాపాడవలసింది. ఇదియే మా విన్నపము’ అని వేడుకున్నాడు. అప్పుడు శ్రీమన్నారాయణుడు ‘ఓ కశ్యపా! నీవు ఎంతయూ చింతించవలదు. ఆ రాక్షసులకు

అంత్యకాలము ఆసన్నమైనది. దేవతలను అవశ్యం రక్షిస్తాను. నేను చెప్పే విషయములు సావధానముగా వినవలసినది. సముద్ర తీరమున గరుడాచలమనే దివ్యక్షేత్రం ఉన్నది. దాని దగ్గరనే బంధురమనే అత్యంత మహిమాన్వితమైన సరస్సు కలదు. ఆ ప్రదేశమంతయూ నాకు అత్యంత ప్రీతికరమైనది. ఆ ప్రదేశంలో అడుగు పెట్టినంతనే సర్వపాపాలూ నశిస్తాయి. పూర్వకాలంలో బ్రహ్మదేవుడు అక్కడ అనేక సంవత్సరాలు తపమాచరించెను. ఈ కొండ కృతయుగంలో బంగారు కొండగానూ, తరువాత త్రేతాయుగంలో వెండికొండగానూ, ద్వాపరయుగంలో రాగి కొండగానూ, కలియుగంలో రాతి కొండగానూ ఉంటుంది. అక్కడ నేను శ్రీమహాలక్ష్మీ తోడ గూఢముగా నుందును. ఆ క్షేత్రములో నీవునూ తపమాచరించి నన్ను దర్శింపవలసింది' అని శెలవిచ్చాడు.

అంత కశ్యప మహాముని వెంటనే గరుడాచలమునకు చేరి ఉపమాక దివ్యక్షేత్రంలో ధర్మపత్నీ సమేతముగా ఘోర తపమాచరించెను.

అప్పుడు ఆ తపస్సుకు మెచ్చి శ్రీమన్నారాయణుడు కశ్యపునకు ప్రత్యక్షమైనాడు. అద్భుత తేజస్సుతో ప్రకాశిస్తున్న ఆ శ్రీమహావిష్ణువును గాంచిన కశ్యపుడు ఎంతో ఆనందపడి ఆ స్వామితో 'ఓ శ్రీమన్నారాయణా! భక్తజన రక్షకా! నీకు అనేక నమస్కారములు. ఈ సృష్టి సర్వస్వమూ నీ రూపమే కదా! నీ మహిమ వర్ణించడానికి ఎంతటి మహాపురుషులకైననూ సాధ్యపడదు. ఇంక నేనెంతవాడను? దయచేసి నన్ను అనుగ్రహించవలసినది. నీవంటి కుమారుడు కలగవలెనని మా దంపతుల కోరిక, ఇంతకు మించిన భాగ్యము లేదు. దయచేసి మా కోరిక మన్నింపవలసింది అని అదితి, కశ్యపులిద్దరూ ఆ స్వామిని వేడుకున్నారు.

అప్పుడు శ్రీమన్నారాయణుడు చిరునవ్వుతో 'ఓ కశ్యపా! నీ కోరిక మన్నించితిని. కాని నాలాంటి వాడంటూ ఎవరూ లేరు. కనుక నేను తప్పక నీకు కుమారుడనై జన్మించి రాక్షసులను సంహరించగలవాడను. నీకిప్పుడు కొన్ని విశేషములను వివరిస్తాను. మీరిద్దరూ సావధానముగా వినవలసింది. పూర్వకాలములో నీవు సుతపుడనే పేరుతోనూ, ఈ అదితి 'వృశ్ని' అనే పేరుతో నీకు భార్యగాను జన్మించెను. అప్పుడు నీవు తపస్సు ఆచరించి నన్ను మీ కుమారునిగా పుట్టవలసిందిగా ప్రార్థించినావు. అప్పుడు నేను 'వృశ్ని గర్భుడ' ను పేరుతో మీ





దంపతులకు జన్మించాను. ఇప్పుడు ఈ జన్మలో కూడా మీరు ఆ విధముగానే కోరుతున్నారు. నేను మీకు వామనుడనే పేరుతో పుట్టి రాక్షసులను అంతమొందిస్తాను. త్రేతాయుగంలో మీరిద్దరూ దశరథ, కౌసల్యలుగా జన్మిస్తారు. అప్పుడు నేను మీకు శ్రీరామచంద్రునిగా జన్మించి రావణసంహారం గావిస్తాను. అటు తరువాత ద్వాపరయుగంలో మీరిరువురూ దేవకీ వాసుదేవులుగా జన్మిస్తారు. మీకు శ్రీకృష్ణునిగా జన్మించే నేను కంసాది రాక్షసులను సంహరిస్తాను. నన్ను ఎల్లప్పుడూ సేవించే ఆదిశేషుడు నాకు అన్నగా బలరాముడనే పేరుతో జన్మిస్తాడు.

ఇక ఆ తరువాత కలికాలంలో మీరిద్దరూ తామ్రపర్ణినదీ తీరములో కారినాథనాయకీ దంపతులుగా జన్మిస్తారు. అప్పుడు నేను మీకు కుమారుడనై జన్మించి చింతచెట్లను ఆశ్రయించి ద్రవిడ భాషలో వేదములను రచించి నమ్మాళ్వారు పేరుతో ప్రసిద్ధి చెందుతాను. కొంతకాలము గడిచిన తరువాత హరితస గోత్రోద్భవులై మీరిరువురూ కేశవదీక్షితులు, కాంతిమతి దంపతులుగా జన్మిస్తారు. అప్పుడు నేను మీకు రామానుజడనే నామంతో జన్మించి వైష్ణవమతానికి బహుళ ప్రాచుర్యం కలిగిస్తాను. వేంకటాద్రిపై నున్న మూర్తి నా రూపమే అని విశదపరుస్తాను. ఎన్ని జన్మలకైనా నీవే నా తండ్రివి. మహాసాధ్వియైన ఈ అదితయే నాకు తల్లి. అని శ్రీమన్నారాయణులవారు శెలవిచ్చారు.

కశ్యప, అదితి దంపతులు ఇదంతా విని ఎంతో సంతసించినవారై 'జై శ్రీమన్నారాయణా! మాదొక విన్నపము. దయచేసి మమ్ములను కరుణించి మా విన్నపమునాలకింపవలసినది. అది ఏమనగా మా ప్రార్థన మన్నించి నీవు ఇచ్చటనే నివసింపవలసినది. కలియుగములో మానవులు అనేక పాపకర్మలనొనర్చుచు, అల్పాయుష్కులై ఉందురు. వారిని ఆ పాపకర్మల నుండి విముక్తిని గావించి అనుగ్రహించుటకై తామీ దివ్య స్థలముననే నిలువవలసినది అని ప్రార్థించారు.

అప్పుడు శ్రీమన్నారాయణులవారు 'ఓ మునివర్యా! నీవన్నట్లుగా కలియుగములో మానవులు ఎంతో బలహీనులై, అల్ప బుద్ధులతో జీవింతురు. నేను వేంకటాద్రి నుండి వేట నెపమున ఈ క్షేత్రమునకు వచ్చెదను. అప్పటినుండి ఈ స్థలము దివ్యక్షేత్రముగా 'ఉపమాక' అనే పేరుతో ప్రసిద్ధి నొందగలదు. భక్తుల కోరికలు

తీర్చడానికై నేను నాలుగు క్షేత్రముల యందు శ్రీవేంకటేశ్వరుడనే నామంతో ప్రకాశింప గలవాడను. అవియే ద్వారకా, వేంకటాద్రి, వాడపల్లి మరియు ఈ ఉపమాక క్షేత్రము. ఈ క్షేత్రములో నేను సర్వవేళలా గూఢముగా నివశించువాడను. భక్తితో నన్ను కొలిచిన వారికి సర్వసౌభాగ్యాలు అనుగ్రహించగలవాడను' అని శెలవిచ్చి శ్రీహరి అంతర్ధానమొందెను.

అంతట కశ్యపుడు అదితితో సహా తిరిగి తన లోకమునకు వెళ్ళాడు. శ్రీహరి వామనునిగా వీరికి జన్మించి బలి చక్రవర్తిని పాతాళమునకు పంపి ఇంద్రునికి తిరిగి స్వర్గాధిపత్యము ఇప్పించినాడు. దేవతలందరూ ఎంతో సంతోషించి శ్రీహరిని ఎన్నో రీతుల స్తుతించారు.

పూర్వకాలములో ఒకానొక సమయమున గరుత్మంతుడు ఈ క్షేత్రంలో ఘోర తపస్సును చేయగా శ్రీహరి సాక్షాత్కరించెను. అప్పుడు గరుత్మంతుడు 'ఓ స్వామీ! నీవే నా సర్వస్వము. ఎల్లవేళలా నీ నామమే నేను ప్రార్థించెదను. నన్ను అనుగ్రహించి నేనెల్లపుడు నిన్ను మోయునట్లుగా కరుణించవలసినది' అని వేడుకున్నాడు.

భక్తవత్సలుడైన ఆ శ్రీహరి ఇందులకు ఎంతో సంతోషించి 'ఓయీ! గరుత్మంతా! నీ భక్తికి నేనెంతో మెచ్చితిని. నీ కోరిక తప్పక తీర్చెదను. నీవు ఈ స్థలముననే పర్వతరూపమున ఉండగలవు. అప్పుడు నేను, శ్రీమహాలక్ష్మీదేవి తోడ ఇక్కడనే నివసించెదను' అని పలుకగా గరుత్మంతులవారు గిరి రూపమును ధరించిరి. అప్పుడు శ్రీమన్నారాయణులవారు శ్రీమహాలక్ష్మి తోడ ఈ కొండపై ఆవిర్భవించిరి. అందుకే ఈ కొండకు గరుడాచలమని పేరు వచ్చెను. ఈ రహస్యము దేవతలకు కూడా తెలియరానిది.

'ఉపమాక' అనే పేరుతో పిలువబడుతున్న ఈ దివ్యక్షేత్రము మిక్కిలి పవిత్రమైనది. ఇక్కడి పుష్కరిణిలో స్నానమాచరించి, వెలసిన శ్రీస్వామి వారిని దర్శించి భక్తులందరూ జన్మసార్థకత చేసుకొనవలెను.

ద్వితీయాధ్యాయము సమాప్తము

శ్రియ: కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్ !
శ్రీ ఉపమాక వాసాయ శ్రీనివాసాయ మంగళమ్







# శ్రీ ఉపమాక క్షేత్ర మాహాత్మ్యము

## మూడవ అధ్యాయము

కలియుగములో మానవులందరూ అల్పాయుష్కులై, అజ్ఞానంతో, అనేక పాపకర్మలను చేస్తూ జీవించడం గమనించిన నారద మహర్షి ఎంతో బాధపడినవాడై, వీరినందరినీ ఈ పాపకర్మలనుండి బయటపడవేసేవాడు శ్రీమన్నారాయణుడొక్కడే అని తలచి స్వామివారిని దర్శించడానికి బయలుదేరాడు. మార్గ మధ్యంలో శ్రీకాళహస్తీశ్వరుని సేవించాడు. ఆ స్వామిని పరిపరివిధాల స్తుతించాడు. అపుడు పరమేశ్వరుడు నారదునితో ‘ఓ నారదా! నీ మనసును నేనెరింగితిని. ఈ మానవులను రక్షించెడివాడు శ్రీవేంకటేశ్వరుడొక్కడే. వేంకటాద్రిపై శ్రీనివాసునిగా వెలసిన శ్రీమన్నారాయణుని దర్శింపవలసింది అని అనుగ్రహించాడు. స్వామికి నమస్కరించి నారదమునీంద్రులవారు జగన్మాత ఐన జ్ఞానాంబికాదేవిని దర్శించి నమస్కరించి పలువిధాల స్తుతించి ఆ తల్లి అనుగ్రహము పొందినవాడై, అక్కడనే ఉన్న శ్రీకుమారస్వామిని కూడా దర్శించి వేంకటాద్రికి పయనమయ్యెను.

నారద మహర్షులవారు శ్రీమహాలక్ష్మిని దర్శించడానికై ముందుగా శుకపురమును చేరుకున్నాడు. అక్కడ కొలువై ఉన్న శ్రీమన్నారాయణుని పట్టపురాణి శ్రీమహాలక్ష్మిదేవిని అనేకవిధాల స్తుతించి తనను అనుగ్రహించవలసిందిగా ప్రార్థించాడు. నారదులవారి భక్తికి సంతోషపడిన జగన్మాత తన పాదుకలను ఆ మహర్షి శిరస్సుమీద ధరింపచేసెను. ఇందులకు మహర్షి ఎంతో ఆనందపడి జన్మ ధన్యమైనదని తలచెను.

నారదుల వారికి అనేక పుష్పములను, తీర్థప్రసాదములను ఇప్పించి, నీ కోరిక శీఘ్రముగానే తీరునని ఆ తల్లి దీవించెను. అక్కడ నుంచి బయలుదేరి నారదులవారు బలరామకృష్ణుల ఆలయమును చేరి వారిని ఈ విధముగా స్తుతించెను. ఓ వసుదేవ తనయులారా! మిమ్ములను దర్శించిన నా జన్మ ధన్యమైనది. ఈ లోకములో మీ వంటి సుందర, దివ్య మూర్తులు ఎచ్చటనూ లేరు. నన్ను అనుగ్రహించవలసినది అని పరిపరివిధాల ప్రార్థించాడు.





అక్కడ నుండి బయలుదేరి నారదులవారు గోవిందరాజు ఆలయానికి చేరి అక్కడ ఎంతో అద్భుతంగా ఉన్నటువంటి శ్రీమన్నారాయణులవారిని, గోవిందరాజుల వారిని దర్శించి ఎంతో ఆనందభరితుడయ్యెను. అటు తరువాత గోదాదేవికి నమస్కరించి సెలవు తీసుకుని చక్రతీర్థమునకు చేరెను. ఎంతో మహిమాన్విత మైనటువంటి చక్రతీర్థంలో స్నానమాచరించి ఆ తీర్థ తీరములో వెలసియున్న శివకేశవులను పూజించి అచ్చట నుండి నమ్మాళ్వార్ల ఆలయమునకు వెళ్ళెను. అచ్చట శఠగోపులవారికి నమస్కరించి ఆనతి తీసుకుని వేంకటాద్రికి పయనమాయెను.

ఎంతో అద్భుత రమణీయ సంపద విరాజిల్లుతున్న భూలోక వైకుంఠమైన వేంకటాద్రిని చూసిన నారదుని ఆనందానికి అవధులు లేవు. చక్కటి రమణీయ ప్రకృతి దృశ్యాలతో అలరారుతున్న వేంకటాచలాన్ని వర్ణించటానికి వేయి నాలుకలున్న ఆదిశేషునికే వీలు కానప్పుడు తనకేల సాధ్యమగునని నారదులవారు తలచిరి. ఎక్కడ చూసిన అద్భుతమైన సెలయేళ్ళు, సరస్సులు, దివ్యతీర్థాలు.. రకరకాల పక్షుల కిలకిలారావాలు..ఆహా! ఎంత రమణీయంగా ఉన్నది ఈ వేంకటాద్రి!

అందుకే కాబోలు ఆ స్వామి వైకుంఠాన్ని కూడా వదిలి ఈ వేంకటాద్రిపై నివసిస్తున్నది. నా జన్మ ధన్యమైనది గదా! ... అని తలచాడు నారద మహర్షి.

వేంకటాద్రి చేరిన నారదులవారు స్వామి పుష్కరిణి యందు స్నానమాచరించి ముందుగా వరాహస్వామి దర్శనం చేసుకున్నాడు. ఆ స్వామిని పరిపరివిధాల స్తుతించి తరువాత అక్కడనే ఉన్న ఆంజనేయస్వామిని కూడా దర్శించి ప్రార్థించాడు.

అటు పిమ్మట శ్రీమన్నారాయణులవారినే తలుస్తూ నారదుల వారు శ్రీవారి ఆనందనిలయం వద్దకు చేరారు. అక్కడ అద్భుత దివ్య తేజస్సుతో వెలిగిపోతున్న శ్రీమన్నారాయణులవారిని గాంచిన నారదుని ఆనందమునకు అంతులేకుండెను.

ఆ స్వామితో 'ఓ శ్రీమన్నారాయణా! జగద్రక్షకా నీకివే నా నమస్కారములు. సృష్టికి సర్వాధారుడవు నీవే! ఈ సమస్తజీవకోటియూ నీ రూపమే కదా తండ్రీ! ఓ జగన్నాయకా! భక్త జనరక్షకా! దీనబంధూ! నీకివే నమస్కారములు. ఓ సమస్త కళ్యాణ స్వరూపా! దివ్య మంగళ మూర్తీ! నీకివే నా నమస్కారములు. దయచేసి అల్పుడనైన నన్ను అనుగ్రహింపవలసింది. నాదొక చిన్న కోరిక గలదు. నాయందు దయవుంచి తీర్చవలసినది. ఇచ్చట వెలసిన నీవు భక్త సులభునిగా ప్రసిద్ధి గాంచినావు. ఈ మానవుల అదృష్టమెంతో కదా! అటులనే సముద్రమునకు చేరువలో యున్న గరుడాద్రిపై కూడా నీవు నివసింపవలసినది. ఈ విధముగా నన్ను అనుగ్రహింపవలసినది' అని అర్థించాడు.

భక్త జనసులభుడైన శ్రీమన్నారాయణులవారు ఎంతో సంతోషించి 'ఓ నారదా! నీకోర్కె తప్పక తీర్చెదను. నీవు నాకు అత్యంత ప్రియుడవు. మిక్కిలి ఆప్తుడవు. నేను నీ కోరికమేర వేట నెపముతో గరుడాద్రికి వచ్చెదను. అచ్చటనూ వెలసి భక్తులకు చేరువలో యుండి నన్నాశ్రయించిన మానవులను రక్షించి ముక్తిని ప్రసాదించెదను. ఆ క్షేత్రము 'ఉపమాక' అనే పేరుతో ఎంతో ప్రసిద్ధి చెందగలదు' అని శెలవిచ్చెను. అంతట నారదుడు ఎంతో సంతోషించి స్వామివారిని అనేక విధముల ప్రార్థించి తిరిగి తన లోకసంచారమునకై బయలుదేరి వెళ్ళెను.

ఆ విధముగా స్వామి అనుగ్రహించిన వెలసిన దివ్యప్రదేశమే ఈ ఉపమాక క్షేత్రము. ఈ క్షేత్రములో స్వామిని సేవించిన ఎడల మన సర్వ పాపములు తొలగి, సర్వ ఐశ్వర్యాలూ లభిస్తాయి. జీవించినంతకాలం సుఖంగా జీవించి చివరకు ముక్తిని పొందుతారు.

తృతీయాధ్యాయము సమాప్తము

శ్రియ: కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్ !
శ్రీ ఉపమాక వాసాయ శ్రీనివాసాయ మంగళమ్







# శ్రీ ఉపమాక క్షేత్ర మాహాత్మ్యము

## నాలుగవ అధ్యాయము

నారద మునీంద్రులవారికి తను తప్పక 'ఉపమాక' క్షేత్రములో వెలియగలనని వరమిచ్చిన శ్రీనివాసుడు ఒకనాడు వేంకటాచాలం నుండి తన సర్వ సైన్యాధ్యక్షుడైన విష్వక్సేనులవారితోను, సర్వసైన్యాలతోనూ వేటకై బయలుదేరాడు. ఆ పరివారముతోడ మార్గమధ్యములో పవిత్ర గోదావరి నదిని చూసి శ్రీమన్నారాయణుడు ఆ గౌతమిని అనుగ్రహింపతలచి, అక్కడ అందరూ స్నానమాచరించవలెనని ఆదేశించెను.

ఆ ఆదేశము విన్న సైన్యగణమంతా శ్రీహరితోడ ఆ పవిత్ర గోదావరిలో స్నానమాచరించాయి. అప్పుడు గౌతమి శ్రీనివాసునికి నమస్కరించి 'తండ్రీ! జగన్నాయకా! నేనెంతటి అదృష్టవంతురాలిని? ఎవ్వరికీ గానీ, ఎన్నో కోట్ల సంవత్సరాల తపస్సుకు గానీ గలగని నీ దర్శనభాగ్యము నాకు కలుగుట నా అదృష్టము ఎంతని వర్ణించగలను? నాయందు అనుగ్రహించి నీవు ఎల్లప్పుడూ రమాదేవితోడ ఇచ్చటనే నివసింపవలసినది. ఇది నా కోరికగా మన్నింపుము' అని పరిపరివిధాల వేడుకున్నది.

భక్తసులభుడైన శ్రీనివాసుడు అందులకు సమ్మతించి గౌతమి తీరాన గల వాడపల్లి వద్ద తన అంశ యొకటి ఉద్భవించగలదని అనుగ్రహించెను. అదియే మన నేటి వాడపల్లి పుణ్యక్షేత్రము.

అక్కడ నుండి బయలుదేరిన శ్రీనివాసుడు కొంతసేపు ప్రయాణించినవాడై ఒక సరస్సు దగ్గరకు చేరెను. తన సైన్యగణముతో ఇటుల చెప్పెను 'ఓ ఆప్తులారా! నేను చెప్పే విషయములు సావధానంగా ఆలకించండి. ఈ సరస్సు మిక్కిలి పవిత్రమైనది. బంధురమనే పేరుగల ఈ కొలను చెంతనే పూర్వము బ్రహ్మ, కశ్యపుడు మొదలగు మహానుభావులు తపమాచరించి నా అనుగ్రహమునకు పాత్రులైనారు.





ఆ కనపడేదే గరుడాచలము. ఆ కొండమీద ఎన్నో వన్య (క్రూర) జంతువులు గలవు. అవి అన్నియు పూర్వజన్మలో నన్ను ఎంతో భక్తి శ్రద్ధలతో సేవించిన మునిపుంగవులే! వారికి ఈ జన్మలో మోక్షమిచ్చెదనని వరమిచ్చితిని. కావున మీరందరూ ఆ కొండపైకి వెళ్ళి అచ్చట మృగములను క్రిందకు తరమవలసింది. వాటిని నేను సంహరించి మోక్ష మొసంగెదను' అని చెప్పగా ఇదంతా విన్న విష్వక్సేనుడు మొదలైన సైన్యగణమంతా ఆశ్చర్యపడి, ఆనందించి స్వామి ఆదేశించినటులే చేసిరి.

అపుడు శ్రీమన్నారాయణుడు కొండ క్రిందకు వచ్చిన మృగములను వేటాడి వాటికి మోక్షము ప్రసాదించెను. ఆ లోకబాంధవుడైన శ్రీమన్నారాయణుని లీలలు సామాన్యులమైన మనకు గోచరింపవు గదా! ఎంతో ఆశ్చర్యకరము, ఆనందకరమైన ఆ స్వామి లీలలు చదువుటయూ, వినుటయూ ఎంతో మహాభాగ్యము.

అటు తరువాత శ్రీనివాసుడు ఆ ప్రదేశంలోనే, శ్రీమహాలక్ష్మీతోడ నారదులవారికి మాట ఇచ్చిన విధముగా శిలారూపమున వెలసెను. కొంత కాలమునకు ఆ ప్రదేశంలో ఆవులను మేపుకొనే రాముడనే గోప బాలునికి స్వప్నములో కనపడి 'నాయనా! ఇక్కడ కొంత దూరములో పొదలమాటున నల్లని శిలల యందు నేను లక్ష్మీదేవితోడ ఉన్నాను. నీవు వచ్చి నన్ను దర్శింపవలసింది' అని అనుగ్రహించాడు.

ఆ గోపాలుని ఆనందానికి అవధులు లేవు. ఆహా! నా జన్మమెంత తరించినది? సాక్షాత్తూ ఆ శ్రీమన్నారాయణులవారే దర్శనమిచ్చి విశదీకరించుట ఎంతటి మహాభాగ్యము. అని తలచి స్వామిని పరిపరివిధాల స్తుతించి మరునాటి ఉదయమున పొదలను వెదుకుతూ ఒకచోట దివ్యతేజస్సుతో నల్లని శిలయందు వెలసిన శ్రీ మహాలక్ష్మీ సహిత శ్రీమన్నారాయణులవారిని కనుగొన్నాడు. ఆ మూర్తుల దివ్యతేజస్సుకు ఆనందించిన గోపాలుడు వెంటనే పరుగు పరుగున ఆ దేశమును పాలించుచున్న శ్రీకృష్ణ భూపాలుని వద్దకు వెళ్ళెను. 'ఓ మహారాజా! నీవెంత అదృష్టవంతుడవు. నీ దేశములో సాక్షాత్తూ ఆ శ్రీమన్నారాయణుడే దివ్యశిలారూపమున

వెలసినాడు. నీ దేశమంతా పావనమైనది. మనందరి జన్మ తరించినది. నాతో రావలసింది. నేను నీకు ఆ స్వామి దర్శనమొసంగిన ప్రదేశము చూపించెదను' అని అన్నాడు.

ఆ మాట విన్న శ్రీకృష్ణభూపాలుని ఆనందానికి అవధులు లేవు. ఆ స్వామిని దర్శించటానికి తానొక్కడే కాదు, మహా పురుషులందరినీ తనతో తీసుకువెళ్ళవలెనని తలంచి తన రాజ్యములోని మహాభక్తులందరినీ రావించి, బ్రాహ్మణోత్తములతోడ, దివ్య మంగళ వాద్యములతోడ, శ్రీ స్వామి వారి దివ్యకీర్తనలు ఆలపిస్తూ ఆ గోపాల బాలుడు చెప్పిన ప్రదేశానికి వెళ్ళి స్వామిని గాంచి ఇలా ప్రార్థించాడు. 'ఓ శ్రీమన్నారాయణా! శ్రీనివాసా! మమ్మలందరినీ అనుగ్రహించడానికై ఇక్కడ వెలిసావా తండ్రీ! మేమెంతటి అదృష్టవంతులము. మా జన్మ ధన్యమైనది. అని అనేక విధాల స్తుతించి వేద పండితులతో స్వామివారికి పూజ చేయించి అద్భుతమైన దేవాలయమును నిర్మింపజేసెను. అద్భుత శిల్ప సంపదతో అలరారే ఆ దివ్య దేవాలయములో స్వామిని దర్శించిన వారికి సర్వ సౌభాగ్యాలూ, సర్వ ఐశ్వర్యాలూ కలుగుతాయి.

కొంతకాలానికి భట్టనాథుడు మొదలగు శ్రీస్వామివారి భక్తులు వచ్చి శ్రీ స్వామివారిని దర్శించి' ఓ శ్రీనివాసా! జగన్నాథా! జగన్నాయక! ఈ ప్రజలందరినీ అనుగ్రహించడానికై నీవు వేంకటాచలము నందుండి ఇచ్చటకు వచ్చావా తండ్రీ! వీరందరూ ఎంతటి అదృష్టవంతులో గదా! అని స్వామిని పరిపరివిధాల స్తుతించిరి. అనేక మంగళా శాసనములు గావించిరి.

అప్పటినుండీ ఆ మహాభక్తులూ, ఎందరో మునీశ్వరులూ ఈ దివ్యక్షేత్రముననే నివసించి నిత్యం శ్రీ స్వామివారిని సేవిస్తూ శ్రీలక్ష్మీనారాయణుల అనుగ్రహ పాత్రులవుతున్నారు.

చతుర్థాధ్యాయము సమాప్తము

శ్రియ: కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్ !
శ్రీ ఉపమాక వాసాయ శ్రీనివాసాయ మంగళమ్







# శ్రీ ఉపమాక క్షేత్ర మాహాత్మ్యము

## పంచమ అధ్యాయము

ఈ నాలుగు అధ్యాయములు వినిన శౌనకాది మహామునులు శ్రీమన్నారాయణునికి తన భక్తులపై గల ప్రేమాదరణలకు ఎంతో సంతోషపడి సూతమహామునిని ఈవిధంగా ప్రశ్నించారు. 'ఓ మహానుభావా! మాకు ఉపమాక క్షేత్రమహాత్మ్యమును ఎంతో చక్కగా వినిపించినావు. ఇంకను మరొక సందేహము కలదు. అదేమనగా తిరుమలలో వైఖానస పద్ధతిలో పూజలు జరుగుచుండగా ఈ ఉపమాక క్షేత్రమున పాంచరాత్ర పద్ధతిలో ఎందులకు పూజాదులు కొనసాగబడుచున్నవి? ఇది మాకు అంతు బట్టుట లేదు. దయచేసి ఈ సందేహమును తీర్చవలసినది' అన్నారు.

అప్పుడు సూతమహాముని ఈవిధంగా చెప్పసాగాడు. 'ఓ మునోత్తములారా! మీ సందేహము నాకు అర్థమైనది. సమాధానము సావధానముగా వినవలసినది. పూర్వకాలములో శ్రీమద్రామానుజుడనే పరమ ఆచార్యులవారు ఒకానొక కార్యమున వైఖానసులందును, వారి సూత్రములందునూ కోపగించుకొనిరి. భూలోకమున శ్రీమన్నారాయణులవారికి ఏ ఆలయములలోనూ వైఖానసులచే పూజాదుల జరుగరాదని ధృఢముగా నిశ్చయించి దేశాటన చేస్తూ ప్రతీ దేవాలయములోనూ పాంచరాత్రమును ప్రవేశపెట్టుచూ కొంతకాలమునకు వేంకటాచలము చేరిరి.

వేంకటాచలమందలి వైఖానసలందరినీ అచ్చట నుండి తక్షణము వెళ్ళిపోవల్సిందిగా కోపము చేసినాడు. అప్పుడు వైఖానసులందరూ శ్రీమన్నారాయణులవారిని పరిపరివిధాల వేడుకున్నారు. 'ఓ జగన్నాథా! ఆర్త జన రక్షకా! శ్రీనివాసా! శ్రీమన్నారాయణా! నీవు కొలిచిన వారికి కొంగు బంగారం కదయ్యా! మమ్ములనేల ఈ విధముగా పరీక్షించుచుంటివి? ఎంతో కాలమునుండీ మేము వైఖానసలు పద్ధతిలో మిమ్ము సేవించుచుంటిమి. ఇప్పుడు ఈ రామానుజలవారు





వచ్చి ఇకముందు ఈ పద్ధతి కొనసాగరాదంటున్నారు. దయచేసి మమ్ము అనుగ్రహించి నిన్ను కొలిచే భాగ్యము ప్రసాదించుము. నిన్ను వీడి మేముండలేము స్వామి' అని ఎన్నోవిధాల అర్థించారు.

అప్పుడు శ్రీనివాసుడు చిరునవ్వుతో 'ఓ వైఖానస శిఖామణులారా! మీరు చింతించవలదు. మీరిచ్చటనే ఉండి నన్ను సేవించవలసినది' అని చెప్పి రామానుజలవారితో' ఓ ఆచార్యపురుషా! నీవునూ మాకు అత్యంత ప్రియుడవే. కానీ ఈ వైఖానసులందరునూ ఎంతో కాలమునుండీ నన్ను సేవించుచున్నారు. ఇపుడు వలదనుట భావ్యము కాదు. కానీ నీ కోరికనూ నేను మన్నించెదను. వింధ్య పర్వతమునకు దక్షిణ సముద్ర తీరమున గరుడాచలమందు నేను లక్ష్మితోడ వెలసితిని. నీ కోరిక ప్రకారం అక్కడ పాంచరాత్ర విధానముననే నేను పూజలు గైకొనగలను. ఆ క్షేత్రము 'ఉపమాక' క్షేత్రమనే పేరుతో దివ్యక్షేత్రముగా వర్ధిల్లగలదు' అని శెలవిచ్చిన అచ్చటి వారందరును సంతోషించిరి.

కొంతకాలమునకు శ్రీమన్నారాయణుని ప్రేరణచే శ్రీరంగము నుండి ఇద్దరు ఆచార్య శ్రేష్ఠులు జగన్నాధుని దర్శింపగోరి ఒక ఒంటెపై మార్గమధ్యమున కావలసిన సరుకును, కొద్ది ధనమును తీసుకుని బయలుదేరిరి. శ్రీ వేంకట భట్టాచార్యులు, శ్రీ వేంకట రంగాచార్యులు అనువీరిరువురూ పాంచరాత్ర కోవిదులు. భరద్వాజస గోత్రులయిన వీరిద్దరూ అమిత విద్యా పారంగతులు. శ్రీనివాసుని ఎడ అత్యంత భక్తి కలవారు.

జగన్నాధుని దర్శించుటకై బయలుదేరిన వారిద్దరూ మార్గమధ్యమమున ఉపమాక క్షేత్రమును చేరుకున్నారు. అక్కడ అద్భుతమైన బంధుర సరస్సులో స్నానమాచరించి ఆ రాత్రికి అచ్చటనే విశ్రమించదలిచారు. అంతలో ఒక గోపబాలకుడు ఆ క్షేత్రములో గల శ్రీనివాసుని దివ్యకథను చెప్పగా ఆచార్య పురుషులిద్దరూ సంతోషపడి ఉదయమున తప్పక స్వామిని దర్శించెదమని నిశ్చయించుకుని నిద్రకుపక్రమించిరి.

ఉదయం లేచినంతనే వారి ఒంటె, ధనమూ మాయమవుట గ్రహించిరి. ఇది శ్రీవేంకటేశ్వరుని మహిమై ఉండవచ్చునని తలచిరి. ఆ స్వామినే ఏల ఇటుల జరిగినదని ప్రార్థించిరి. అప్పుడు అశరీరవాణి ఈ విధముగా పలికెను. ' ఓ పుణ్యపురుషులారా! నేనే శ్రీనివాసుడను. మీరిరువురిలో ఒకరు ఎల్లప్పుడునూ ఈ క్షేత్రముననే నివసించి పాంచరాత్ర పద్ధతిలో నన్ను సేవించవలసినది. రెండవ వారు తను ఇష్టానుసారము వెళ్ళవచ్చును' అని ఆదేశించెను.

అందులకు ఆ అన్నదమ్ములిద్దరూ ఎంతో సంతోషించి, అన్నయగు శ్రీ వేంకట భట్టాచార్యులు ఇచ్చుటనే నివసించి స్వామిని సేవించవలెనని నిశ్చయించుకొనెను. వెంటనే స్వామి మహిమచే వారి ఒంటెయు, ధనమునూ ప్రత్యక్షమయ్యెను. తమ్ముడు శ్రీ వేంకట రంగాచార్యులు స్వామిని మనస్సులో ప్రార్థించి, అన్న వద్ద సెలవు తీసుకుని ఒంటె మరియు ధనముతోడ తన ప్రయాణము సాగించెను.

ఆనాడే శ్రీవేంకటేశ్వరుడు ఆ దేశరాజగు శ్రీ కృష్ణ భూపాలునకు స్వప్నములో కనపడి ఈ వృత్తాంతమంతయు వివరించి శ్రీ వేంకట భట్టాచార్యులు యొక్క పోషణ భారమంతయూ వహించవలసినదిగా ఆదేశించెను. శ్రీకృష్ణ భూపాలుడు అటులనే అని స్వామి ఆజ్ఞను శిరసావహించి ఆనందముతో స్వామిని సేవించెను. ఆలయమును ఎంతో అభివృద్ధి చేసి, ఆలయ పోషణకు, ఆచార్యులవారి కుటుంబ పోషణకు కావలసిన ధనధాన్యాదులు సమకూర్చెను.

అప్పటినుండి ఆచార్యులవారు స్వామినే సేవిస్తూ కాలం గడుపుతుండగా కొంతకాలానికి ఆయన మనస్సులో ఒక చింత కలిగింది. తను ఒక్కడే ఇంత దూరములో నున్న తన వంశం ఏమి వృద్ధి కాగలదు? అని తలచి ఆ శ్రీస్వామివారినే మనస్సులో ప్రార్థించెను. అప్పుడా స్వామివారు ప్రత్యక్షమై 'ఓ ఆచార్య పురుషా! నీవు నీ వంశాభివృద్ధికై చింతింపవలదు. పూర్వకాలములో ఒకసారి శ్రీ రామానుజాచార్యులవారు అనేక క్షేత్రములు పర్యటించుచూ శ్రీకూర్మక్షేత్రమునకు రాగా అక్కడి ఆచార్యులు కూడా ఈవిధముగానే ప్రశ్నించిరి. అప్పుడు శ్రీ రామానుజలవారు అక్కడివారికి పంచ సంస్కారములు గావించి వారితోనే సంబంధము ఏర్పరచుకొనమని చెప్పిరి.





ఆ విధముగానే నీవు కూడా నీ శిష్య గణము, వారి బంధుగణముతో సంబంధ బాంధవ్యములు ఏర్పరచుకొనవలసినది' అని అనుగ్రహించెను.

అందులకు ఆచార్యులవారు ఎంతో సంతోషించి, స్వామి ఆనతి ప్రకారము చేసి కలకాలము స్వామినే సేవిస్తూ చివరకు ముక్తిని పొందెను.

ఈ ఉపమాక మహిమాన్విత క్షేత్రము. ఈ క్షేత్రములో శ్రీస్వామిని దర్శించినవారికి జన్మజన్మముల పాపములు పటాపంచలు కాగలవు.

పంచమోధ్యాయము సమాప్తము

శ్రియ: కాంతాయ కళ్యాణ నిధయే నిధయేర్థినామ్ !<br>
శ్రీ ఉపమాక వాసాయ శ్రీనివాసాయ మంగళమ్

## క్షేత్ర విశేషాలు

- ఈ క్షేత్రమును గురించి బ్రహ్మవైవర్తన పురాణమునందు (గరుడాచల మహాత్మ్యం), స్కాంద పురాణము లందు ఈ విషయము పేర్కొనబడినది.

- 17వ, 18వ శతాబ్దములలో పిఠాపురం సంస్థానమునకు చెందిన ప్రభువు ముచ్చటపడి ఎంతో విలువైన పచ్చలు, వజ్రాలు పొదిగిన కిరీటము చేయించుకుని ఒక శుభముహూర్తమున ధరించుదామని అనుకుని ఏర్పాట్లు చేసుకున్నారట. శుభముహూర్తమునకు ముందురోజున ఆ రాజునకు స్వప్నమున స్వామి దర్శనమిచ్చి ఉపమాక క్షేత్రమున నేను వేంచేసి ఉండగా నాకు సమర్పించక నీవు ధరించెదవా అని అడుగగా, మరునాడు గొప్ప సైన్యముతోను, గజములు, అశ్వములతో గూడి గొప్ప ఊరేగింపుగా వచ్చి శ్రీస్వామివారికి కిరీటము సమర్పించెను.

- బ్రౌన్ దొరగారు కూర్చిన హిందు దేవాలయాల చరిత్రలో కూడా ఈ ఉపమాక దేవాలయము ప్రసక్తి కలదు. ప్రస్తుతము ఈ గ్రంథము మద్రాసు (చెన్నై) Connemere గ్రంధాలయమునందు దానిని మనము చూడగలము.

- జగద్గురు శ్రీ త్రిదండి రామానుజాచార్యుల వారు భారతదేశమందలి 108 క్షేత్రములు దర్శించి శ్లోకరూపమున 108 క్షేత్రములు వర్ణించిరి. అందు "తార్క్ష్యాద్రి సింహాచలౌ" అని పేర్కొనుట చేత, తార్క్ష్యాద్రి అనగా గరుడాద్రి అగుటచేత వారి జీవితకాలం 1017 ఎ.డి. -1137 ఎ.డి. అగుట చేత ఈ క్షేత్రము చాలా పురాతనమైనదిగా గుర్తింపబడుతున్నది.

- కొండ దిగువ భాగములో దాసాంజనేయస్వామి ఆలయం ఉన్నది. ఈయన కొండమీద శ్రీస్వామివారికి దాసోహం (నమస్కారం) చేస్తున్నట్లుగా వెలసినారు. వీరు శ్రీరామదాసుడు కనుక వీరు వెలసిన చోట శ్రీసీతారాముల విగ్రహ ప్రతిష్ట జరిగినది.





- ఈ క్షేత్రములో కొండ దిగువ భాగమున ఉన్న ఆలయంలో శ్రీసంతాన వేణుగోపాలస్వామి వారు క్షేత్రపాలకులుగా వేంచేసి ఉన్నారు. కొండమీద వేంచేసిన మూలవరులకు ఉత్సవరులు కూడా వీరి సన్నిధిలోనే వేంచేసి ఉన్నారు. వీరందరిని నిత్య నారాయణ మంత్ర నిష్టాగరిష్టులు, త్రిలోక సంచారి అయిన శ్రీ నారదమహర్షి ప్రతిష్టచేసినారని చరిత్ర ద్వారా తెలియపడుతుంది.

- ఈ ఆలయమునకు నాలుగువైపులా శ్రీఅండాళ్ అమ్మవారు (గోదాదేవి), శ్రీ నమ్మాళ్వార్లు, శ్రీ భగవద్రామానుజులు, శ్రీ మణవాళమహామునులకు నాలుగు ఉప ఆలయములు కలవు.

- కొండ దిగువ భాగమున గరుడాచలములనకు (గరుడాద్రి) ఎదురుగా, శ్రీస్వామి వారికి ఉత్తర దిక్కుగా బంధుర సరస్సు అను కోనేరు కలదు. ఇక్కడనే బ్రహ్మ, నారదమహర్షి, అదితి కశ్యప దంపతులు, ఇందు స్నానమాచరించి, తపమాచరించిరి. ఇది ఒక యుగమునకు సంబంధించినది కాదు. శ్రీస్వామివారి నిత్యాభిషేకము మరియు ఇతర పూజలకు ఈ కోనేరులోని నీటినే వాడుదురు. ఈ సరస్సులో స్నానం ఆచరించిన ఎడల బ్రహ్మహత్యాపాతకములు నశించుననియు మరియు తిరుమలలో పాపనాశనంలో స్నానం చేసినంత ఫలితం లభిస్తుందని నానుడి.

- ఈ పర్వతమును దూరం నుండి చూచిన యెడల గరుడ పక్షి ఆకారంలో ఉంటుందన్న ప్రసిద్ధి, అందువలనే దీనిని గరుడాద్రిగా, గరుడాచలం గా కూడా వ్యవహరిస్తారు.

- శ్రీస్వామివారు సంతాన ఫలప్రదాతగా ప్రసిద్ధి పొందారు. సంతాన ప్రాప్తి కోసం భక్తులు ప్రతిరోజు జరిగే పంచామృతాభిషేక సమయంలో శ్రీస్వామివారిని దర్శించి, అభిషేకం చేయించుకొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించిన, వారికి సంతాన ప్రాప్తి కలుగునని నమ్మకం. దీనికి నిదర్శనమే శ్రీస్వామివారు అదితి, కశ్యపులకు వివిధ అవతార సమయాలలో వివిధ రూపాలలో జన్మించినారు.

☛ ఈ ఉపమాక క్షేత్రములో ఉన్న (రామస్థూపం) రామకోటి స్తంభం ది. 04.05.1964న శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ పెద్ద జీయ్యర్ స్వామివారి చేత ప్రతిష్ఠింపబడినది. భారతదేశంలో ఈ స్వామివారిచే ప్రతిష్ఠింపబడిన 108 రామస్థూపాలలో ఇది 48వది.

☛ శ్రీస్వామివారు గరుడాద్రిపై విశ్రాంతి కోసము (పవళింపు) వేంచేసినట్లుగా విశదమగుచున్నది

☛ అన్ని క్షేత్రములయందు సంవత్సరమునకు ఒక్కరోజు లభించు ఉత్తరద్వార దర్శనం, ఇక్కడ మాత్రము నిత్యవైకుంఠ ద్వార దర్శనముగా విలసిల్లుచున్నది.

☛ వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి రోజన శ్రీస్వామివారు శ్రీరంగనాధుని అలంకరణలో దర్శనమిస్తారు. వీరితో పాటు వివిధ సన్నిధులలో వేంచేసి వున్న ఉత్సవర్లు కూడా శ్రీస్వామివారితో పాటుగా ఎనిమిది (8) వాహనములలో తిరువీధికి వేంచేస్తారు.

☛ కనుమ రోజున (సంక్రాంతి మరుసటి రోజు) శ్రీస్వామివారు రాజాధిరాజ అలంకరణలో వేంచేస్తారు. ఈ రోజున సాయంకాల సమయంలో శ్రీస్వామివారు భక్తులతో కలిసి గిరి ప్రదక్షణ (కొండచుట్టూ ప్రదక్షణ)కు వేంచేస్తారు. ఈ రోజున చిన్న తీర్థము జరుగును.

☛ ఈ దేవాలయము నందు పూజాదికములు పాంచరాత్ర ఆగమ శాస్త్రమును అనుసరించి శ్రీస్వామివారికి వార్షిక కళ్యాణోత్సవములు (5 రోజులు)- 20 రోజుల తీర్థము, బ్రహ్మోత్సవములు, అధ్యయన ఉత్సవములు, తిరు కళ్యాణములు, ద్వాదశ ఆళ్వార్ల తిరు నక్షత్రములు శ్రీరాముని అధ్యయన ఉత్సవములు, వైశాఖ శుద్ధ ఏకాదశినాడు శ్రీవేణుగోపాల స్వామి వారి వార్షిక కళ్యాణము, ధనుస్సంక్రమణము మున్నగు విశేష కార్యక్రమములతోపాటు ఆయా సమయములందు పుణ్యకోటి వాహనము, పొన్న వాహనము, ఇత్తడి గరుడ వాహనము, లక్కగరుడ వాహనము, రాజాధి రాజ వాహనము, సప్పరము, హంసవాహనము, అశ్వవాహనము, గజ వాహనము, పెద్దపల్లకి, చిన్నపల్లకి





వాహనములపై శ్రీవేంకటేశ్వర స్వామి వారికి ఉభయ నాంచారులతో కూడా గ్రామ తిరువీధి సేవలు వైభవోపేతముగా జరుగును. ఈ క్షేత్రము నందు ప్రతి నిత్యము ఉదయము, రాత్రివేళల యందు నాలాయిర సేవాకాలము, శ్రీస్వామి వారికి విన్నపము జరుగును.

☛ ఉపమాక శ్రీవేంకటేశ్వరస్వామి వారి తిరుకళ్యాణోత్సవమునందు చదువబడే సంవాదత్రయమును పరవస్తు వేంకట రంగనాధ స్వామి అయ్యవారిచే చోర సంవాదము, పరవస్తు లక్ష్మీనరసింహస్వామి అయ్యవారల (లక్ష్మీవరణ, లక్ష్మీనారాయణ సంవాదములు) చే ఆంధ్రీకరింపబడినవి.

☛ శ్రీస్వామివారి తిరుకళ్యాణోత్సవములలో ఐదవ(5వ) రోజున శ్రీస్వామి వారు, వారితో పాటు సుదర్శనాళ్వాన్ (చక్ర పెరుమాళ్ళు) లను వాహనముపై వేంచేపు చేసి చక్రస్నానమునకు సుమారు నాలుగు కిలో మీటర్లు దూరమున గల సముద్రమునకు బయలుదేరుతారు. సముద్రము దగ్గరలో శ్రీస్వామి వారు మండపంపై వేంచేస్తారు. చక్ర పెరుమాళ్ళు మాత్రము సముద్రమునకు వేంచేస్తారు.

☛ ఇక్కడ ఏదైనా కోరికను శ్రీస్వామివారికి విన్నవించి, అది నెరవేరిన తరువాత కాలి నడకను కొండపైకి వస్తాననుకొనిన ఆ కోరిక నెరవేరును. కోరిక నెరవేరిన పిదప తప్పక కాలినడకన కొండపైకి వెళ్ళి శ్రీస్వామివారి దర్శనం చేసుకొనవలెను.

☛ పిఠాపురం సంస్థానాస్థానకవి దేవులపల్లి సుబ్బరాయశాస్త్రి "మహేంద్రవిజయ" మను "ఉపమాకక్షేత్ర మహాత్మము" ను రచించారు. పాయకరావుపేట సంస్థాన పాలకులలో ఒకడైన రామభద్ర పాయకరావు ఆస్థానకవియైన వైదరసు అప్పయ్యకవి "విబుధలోకేశ! ఉపమాక వేంకటేశ" అను మకుటము గల సీస పద్య శతకములో ఉపమాకలో వెలసిన శ్రీఅలమేలుమంగ శ్రీవేంకటేశ్వరుల పరిణయ కధను వర్ణించారు.

☛ తిరుమలలో జరుగు అన్ని ఉత్సవములు ఈ క్షేత్రంలో జరుగును.

## నిత్య పూజా కార్యక్రమ వివరములు

☛ ఉదయం 6గం.ల నుండి మ. 12గం. ల వరకు, సాయంత్రం 5 గం.ల నుండి 8 గం. ల వరకు ప్రతిరోజూ తిరువారాధన మరియు అష్టోత్తర శతనామార్చన జరుగును. ఉదయం 8 గం. లనుండి 9 గం. ల వరకు కొండపైన మూలవిరాట్‌కి పంచామృత అభిషేకం జరుపబడును. విశేషమైన సమయములలో మాత్రం ఈ అభిషేకం వేకువజాముననే జరుపబడును. కావున భక్తులు దేవస్థాన కార్యాలయమును సంప్రదించి సమయ నిర్ధారణ చేసుకోవలెను. శ్రీ వైష్ణవ క్షేత్రములయందు ఆరాధనలు, అర్చనలు మాత్రమే ఉండును. నిత్యాభిషేకము కొన్ని క్షేత్రములయందు మాత్రమే కలదు.

☛ శ్రీస్వామివారి కళ్యాణము కొరకు దేవస్థానమునకు రూ.516/-లు చెల్లించవలెను. ధనుర్మాసం (డిసెంబరు - జనవరి), బ్రహ్మోత్సవాలు - 10 రోజులు, తీర్థ కళ్యాణోత్సవ సమయంలో (ఫిబ్రవరి - మార్చి), తిరునక్షత్రముల సమయంలో తప్ప, మిగతా అన్ని రోజుల్లో శ్రీస్వామివారికి (భక్తులు కోరిన రోజున) కళ్యాణము జరిపించుకొనగల వీలున్నది.

కళ్యాణ సమయం : ఉదయం 11 గం.ల నుండి మ. 2గం. లవరకు

☛ ఈ క్షేత్రంలో ప్రతి శుక్రవారం సాయంత్రం 6గం.ల నుండి 7గం. ల వరకు శ్రీ ఆండాళ్ళమ్మ (గోదాదేవి) వారికి సహస్రనామ కుంకుమార్చన జరుపబడును.





## ఆలయ నిర్మాణము / నిర్వాహణ


మనకు లభిస్తున్న శాసనములు ఆధారంగా యలమంచిలి చాణక్యప్రభువలలో ఒకడైన ఐదవ ఉపేంద్రుడు (క్రీ॥శ॥ 1375-77) పేర వెలసిన ఉపేంద్రవర అగ్రహారమే నేటి ఉపమాకగా గుర్తించవచ్చు. (యస్.ఐ.ఐ.వాల్యూం 6 నెం. 662)

పాయకరావుపేట సంస్థాన పాలకులలో నొకడైన కాకర్లపూడి అప్పలరాజు కాలమున (సుమారు 1770 సం॥) ఈ ఆలయము నిర్మించబడినట్లు తెలుస్తోంది.

ఆధునిక కాలమున ఉపమాక క్షేత్రము గోడే జమిందారుల భక్తి ప్రపత్తుల వలన వర్థిల్లింది. మహారాజా సర్‌గోడే నారాయణ గజపతిరావు (1828-1903) కుమార్తె వడ్వాన్ మహారాణి శ్రీ సీతాబా జమీందారిణివారి ఆధ్వర్యంలో ఈ ఆలయ మరింత అభివృద్ధికి నోచుకుంది.

జమీందారీల రద్దు చట్టం అమలులోనికి వచ్చినంత వరకు ఈ దేవాలయము పరిపాలన పూర్వవైభవమునకు తగ్గకుండా ఉండేది. జమీందారు పరిపాలనలో ఈ స్వామి వారికి కైంకర్యము చేయుటకు నలుగురు అర్చక స్వాములు, ఇద్దరు ద్రావిడ వేద పండితులు, ఒక వేద పండితుడు, ముగ్గురు తోట మాలీలు అయిదుగురు భజంత్రీ మేళము వారు వగైరా ప్రధానముగా సేవలందించెడివారు. తరువాత వారు వంశపారంపర్య ధర్మకర్తలుగా నేటికినీ వ్యవహరించుచున్నారు. ప్రతి సంవత్సరము ఫాల్గుణ శుద్ధ ఏకాదశినాడు శ్రీవేంకటేశ్వరస్వామి వారి కళ్యాణమునకు మంగళ సూత్రములు మధు పర్కములు వారు పంపుచునే యున్నారు.

1935 వ సంవత్సరము తరువాత ఈ దేవాలయ నిర్వహణ దేవాదాయ-ధర్మాదాయ శాఖ, ఆంధ్రప్రదేశ్ వారి వశమైనది.


Dept. of History and Archaeology

Dr. K. Suryanarayana
Head of the Dept.
Dept. of History and Archaeology
Andhra University
VISAKHAPATNAM - 530 003

Andhra University





## దేవస్థానం వెలుపల/గ్రామంలో నెలకొనివున్న పవిత్ర దైవ స్థలములు

1. తూర్పువైపున శ్రీభువనేశ్వరి సహిత లక్ష్మణేశ్వర స్వామి ఆలయం కలదు.
2. పై ఆలయమునకు కుడివైపున శ్రీకామాక్షి అమ్మవారి ఆలయం కలదు.
3. ఈ ఉపమాక క్షేత్రమునకు 14 కి.మీ. దూరంలో ఉన్న ఒడ్డిమెట్ట అను గ్రామములో శ్రీగణపతి ఆలయం కలదు. ఇది ఏకశిలా విగ్రహము. తుని పట్టణమునకు వెళ్ళే మార్గములో ఈ ఆలయం కలదు.
4. ఈ ఉపమాక క్షేత్రమునకు 19 కి.మీ. దూరంలో ఉన్న పాయకరావుపేట గ్రామములో శ్రీరాధా రుక్మిణి సహిత పాండురంగ స్వామివారి దేవస్థానం కలదు. ఇది 1925 సం॥లో నిర్మించబడినది.
5. ఈ ఉపమాక క్షేత్రమునకు 28 కి.మీ. దూరములో తలుపులమ్మలోవ అనే గ్రామంలో శ్రీతలుపులమ్మతల్లి దేవస్థానం కలదు.
6. ఈ ఉపమాక క్షేత్రమునకు 10 కి.మీ. దూరములో, రేవుపోలవరం అను గ్రామ సమీపమున గల సముద్రపు ఒడ్డున శ్రీకుంతీమాధవస్వామి దేవస్థానము కలదు.
7. ఈ ఉపమాక క్షేత్రమునకు 30 కి.మీ. దూరములో, యలమంచిలి పట్టణమునకు దగ్గరలో పంచదార్ల అను శివక్షేత్రము కలదు.

### ఈ క్షేత్రమునకు దగ్గరలో గల సముద్ర తీర ప్రాంత వివరములు

| | | |
|---|---|---|
| 1. | ఈ క్షేత్రమునకు 4 కి.మీ. దూరంలో ఉన్న | రాజయ్యపేట |
| 2. | ఈ క్షేత్రమునకు 5 కి.మీ. దూరంలో ఉన్న | బోయపాడు |
| 3. | ఈ క్షేత్రమునకు 8 కి.మీ. దూరంలో ఉన్న | దొండవాక |
| 4. | ఈ క్షేత్రమునకు 7 కి.మీ. దూరంలో ఉన్న | తీనార్ల |

# దండకము

శ్రీవేంకటేశా! రమాధీశ! శేషాచలవాసా! భక్తావనోద్దేశ! ధర్మప్రకాశా! శ్రితవాప్తనానావిధాశా! జగద్ద్రోహిదైతేయనాశా మహేశామరాధీశ వాగీశ మౌనీశ చిత్తాంబుజావాస! భాస్వన్మహాయోగివర్యాంతరాకాశ! యానంద సందేశ! నీసేవఁ గావించి నీక్షేత్రరాజ్యమ్ము దర్శించి నిన్నెప్పుడున్ జిత్తపద్మంబునన్ నిల్పి ధ్యానించి, నీ సత్కృపాపాత్రులై యైహికా ముష్మిక శ్రేయముల్ పొందరేమున్న సంఖ్యాకులౌ భక్త చూడామణుల్; నీవు భక్తాళి రక్షింపగా గంకణం బూనియున్నావు; నిష్కామతన్ గొల్వంగా సుప్రసన్నుండవై నీవు సారూప్య, సాలోక్య, సామీప్య, సాయుజ్యముల్ గూర్చుచున్నావు; నిన్గోరుకొన్నట్టి వెన్నేనియున్ గోర్కెలన్ నిత్యమున్ నీవు చేకూర్చుచున్నావు; సాకారు నిన్నా శ్రయింపన్ శుభశ్రీలనంతమ్ముగా నిచ్చు చున్నావు; నిన్నున్ నిరాకారు డంచున్ సేవించుచున్నన్ బునర్జన్మ రాహిత్యమున్ గూర్చుచున్నావు; శ్రీదేవితోనున్న నీదివ్యమూర్తిన్ మనంబంధుభిన్నంబుగా నెంచి యట్లే విలోకించుచున్నన్ మహాధన్యులన్ జేయుచున్నావు; నిను ధిక్కరింపన్ విజృంభించు మూఢాత్ములన్ దల్లిదండ్రుల్ స్వసంతానమున్ దిద్దు చందంబునన్ నీవు శిక్షించుచున్నావు; నీయాజ్ఞ లేకున్న నేప్రాణికన్ సౌఖ్యలేశమ్మునున్ లేదు; నీపై నెదుర్కొన్నచో రౌరవంబే నివాసంబుగా జీవి సంతాపమును బొందుచుండున్, వివేకమ్ముతో నుండి నీకంటె దైవంబు వేఱొందు లేకుంట నీక్షేత్రరాజ్యమ్ముకంటె మహాక్షేత్ర రాజమ్ము వేఱొందులేకుంట భావించు సేవించు పుణ్యాత్ములను నీవు దీవించి శ్రీమంతులును గాగ ధీమంతులునుగాగ బాలించుచున్నావు; నేనిత్తఱిను నిన్ను గీర్తించి నాచిత్త పద్మమ్ము నర్పించి నీపూజ గావింతు నన్నెట్లుగా నిందు వాత్సల్యమున్ జూపి బ్రోవంగ నున్నావో? వింధ్యాద్రికిన్ దక్షిణంబందు బెంపొందు దేశమ్ము నెల్లన్ సదా కృపాపాంగ దృష్టిన్ బ్రసాదించి రక్షింప బ్రార్థింతు, నాకున్ వరంబిచ్చి మన్నింపవే ప్రీతితో శ్రీనివాసా! నమస్తే నమస్తే నమః





# దేవస్థానంనందు సంవత్సరంలో నిర్వహించు పూజా కార్యక్రమ వివరాలు

| వరుస సంఖ్య | ఉత్సవం/పండుగ పేరు | రోజులు | సంక్రమణము | నక్షత్రము | ఉదయం/రాత్రి | ఉత్సవం ప్రత్యేకత |
|---|---|---|---|---|---|---|
| 1. | చైత్రశుద్ధ పాడ్యమి | ఒక్కరోజు | – | – | రాత్రి | విష్వక్సేన ఆరాధన, పుణ్యాహ్వావాచనం, పంచాంగ శ్రవణం, స్వామివారి ఆరాధన, సేవాకాలం, ప్రసాద వినియోగం. |
| 2. | చైత్రశుద్ధ నవమి | ఒక్కరోజు | – | – | ఉదయం | నిత్యారాధన, ధూపం, బాలభోగం, నివేదన, నిత్యహోమం, శాత్తుతీర్థ గోష్ఠి, శ్రీసీతారాముల కళ్యాణం, ప్రసాద వినియోగం, మహారాజ భోగం నివేదన. |
| 3. | ఎంబెరుమన్నార్ తిరు నక్షత్రం | 5 రోజులు | మేషసంక్రమణం | ఆరుద్ర | ఉదయం–రాత్రి | నాలాయిర సేవాకాలం, 5 వ రోజున కోయిల్ తిరువాయ్‌మొడి,ఇరామానుశ నూత్తన్దాది ఉపదేశ రత్నమాల సేవాకాలం, నివేదన, హారతి శాత్తు తనయ, తీర్థ గోష్ఠి, ప్రసాద వినియోగం. |
| 4. | వైశాఖశుద్ధ ఏకాదశి | ఒక్కరోజు | – | – | రాత్రి | శ్రీవేణుగోపాల స్వామివారి వార్షిక కళ్యాణం, నిత్యారాదన, సేవాకాలం, తీర్థగోష్ఠి, ప్రసాద వినియోగం. |
| 5. | మధురకవి ఆళ్వార్ తిరు నక్షత్రం | ఒక్కరోజు | – | – | పగలు | కోయిల్ తిరువాయ్‌మొడి, ఇరామానుశ నూత్తన్దాది ఉపదేశ రత్నమాల సేవాకాలం, నివేదన, తీర్థగోష్ఠి, ప్రసాద వినియోగం. |
| 6. | నమ్మాళ్వార్ తిరునక్షత్రం | 5 రోజులు | వృషభ సంక్రమణం | విశాఖ | ఉదయం–రాత్రి | నాలాయిర సేవాకాలం, చివరి రోజు కోయిల్ తిరువాయ్‌మొడి,ఇరామానుశ నూత్తన్దాది ఉపదేశ రత్నమాల సేవాకాలం, నివేదన, |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| | | | | | | తీర్థగోష్ఠి, ప్రసాద వినియోగం. |
| 7. | పెరియాళ్వార్ | 5 రోజులు | మిధున సంక్రమణం | స్వాతి | ఉదయం-రాత్రి | నాలాయిర సేవాకాలం, చివరి రోజు కోయిల్ తిరువాయ్‌మొడి, ఇరామానుశ నూత్తన్దాది ఉపదేశ రత్నమాల సేవాకాలం, నివేదన, తీర్థగోష్ఠి, ప్రసాద వినియోగం. |
| 8. | తొలి ఏకాదశి ఆషాఢ శుద్ధ ఏకాదశి | ఒక్కరోజు | - | - | సాయంత్రం | స్వామివారి నామ సంకీర్తనతో గిరి ప్రదక్షణ, అనంతరం ప్రసాద వినియోగం, నిత్య అర్చన. |
| 9. | ఆండాళ్ తిరునక్షత్రం | 5 రోజులు | కర్కాటక సంక్రమణం | పుబ్బ | ఉదయం-రాత్రి | నాలాయిర సేవాకాలం, చివరి రోజు కోయిల్ తిరువాయ్‌మొడి, ఇరామానుశ నూత్తన్దాది ఉపదేశ రత్నమాల సేవాకాలం, నివేదన, తీర్థగోష్ఠి, ప్రసాద వినియోగం. |
| | శ్రావణశుక్రవార తిరువీధి ఉత్సవం | శ్రావణ శుక్రవారములు | | | సాయంత్రం | తిరువీధి ఉత్సవం మరియు మూల సన్నిధిలో సహస్రనామ కుంకుమార్చన |
| 10. | కృష్ణాష్టమి (బహుళాష్టమి) | 2 రోజులు | సింహ సంక్రమణం | రోహిణి | ఉదయం | కొండపైన, క్రింద కోవెలలో అభిషేకం, బాలభోగం |
| | | | | | సాయంత్రం | యశోద అలంకారం, సప్తహారతులు, కృష్ణ వేంకటేశ్వర, లక్ష్మిఅష్టోత్తరాలతో పూజ, నివేదన, మంగళాశాసనము, తీర్థగోష్ఠి, నిత్యార్చన. |
| | కృష్ణాష్టమి | 2వ రోజు | సింహ సంక్రమణం | | సాయంత్రం | ఉట్టు పండుగ, తిరువీధి, ఆరాధన, నివేదన. |





| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 11. | బ్రహ్మోత్సవాలు | 10 రోజులు | కన్యా సంక్రమణం | శ్రవణం | ఉదయం-సా॥ | ప్రారంభరోజు సాయంత్రం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహావాచనం, పంచకలశారాధన, ఋత్విగ్వరణం, మృత్సంగ్రహణం, తిరువీధి, అంతరాలయ దేవతపూజ, వాస్తుమండప పూజ సప్త ఋషుల అవాహన, యోగీశ్వర మండపం, హోమశాలలో అష్టదిక్పాలక ఆవాహనం, గరుడపూజ, అగ్నిముఖం, హోమాలు, మరుసటి దినం గర్భగుడి మరియు గ్రామంలో అష్టదిక్పాలక ఆవాహన, తిరువీధిలో జరుగును. అనంతరం ధ్వజపట ప్రతిష్ఠ, ప్రసాద వినియోగం. యీ రోజు నుండి నాలాయిర సేవా కాలంతోపాటు ఉదయం-సాయంత్రం తిరువీధి విశేష కార్యక్రమాలు జరుగును. |
| | శమీపూజ | ఒక్కరోజు | విజయదశమి(దసరా) | | సాయంత్రం | స్వామివారిని పుణ్యకోటి వాహనంలో చెరువు మండపం మీదకు వేంచేపు చేసి శమీ (జమ్మిచెట్టు) పూజ, ప్రసాద వినియోగం, తిరువీధి ఉత్సవం. |
| 12. | నరక చతుర్ధశి ఆశ్వీయుజ బ॥చతుర్ధశి | ఒక్కరోజు | - | - | సాయంత్రం | నిత్యారాధన, సేవాకాలం, నివేదన, తీర్థగోష్ఠి, నరకాసుర వధ, కార్యక్రమం, పవళింపు |
| 13. | మణవాళత మహాముని తిరు నక్షత్రం | 5 రోజులు | తులా సంక్రమణం | మూల | | నాలాయిర సేవాకాలం, చివరి రోజు కోయిల్ తిరువాయ్‌మొడి, ఇరామానుశ నూత్తన్దాది ఉపదేశ రత్నమాల సేవాకాలం, నివేదన, తీర్థగోష్ఠి, ప్రసాద వినియోగం. |
| 14. | పోయిఘై ఆళ్వార్ | ఒక్కరోజు | తులా సంక్రమణం | శ్రవణం | ఉదయం | కోయిల్ తిరువాయ్‌మొడి, ఇరామానుశ |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| | తిరు నక్షత్రం | | | | | నూత్తన్దాది, ఉపదేశ రత్నమాల సేవాకాలం, నివేదన, తీర్థగోష్ఠి, ప్రసాద వినియోగం. |
| 15. | పూదత్తాళ్వార్ తిరు నక్షత్రం | ఒక్కరోజు | తులా సంక్రమణం | ధనిష్ఠ | ఉదయం | కోయిల్ తిరువాయ్‌మొడి, ఇరామానుశ నూత్తన్దాది, ఉపదేశ రత్నమాల సేవాకాలం, నివేదన, తీర్థగోష్ఠి, ప్రసాద వినియోగం. |
| 16. | పేయాళ్వార్ తిరు నక్షత్రం | ఒక్కరోజు | తులా సంక్రమణం | శతభిషం | ఉదయం | కోయిల్ తిరువాయ్‌మొడి, ఇరామానుశ నూత్తన్దాది, ఉపదేశ రత్నమాల సేవాకాలం, నివేదన, తీర్థగోష్ఠి, ప్రసాద వినియోగం. |
| 17. | చిలుకుల ద్వాదశి | ఒక్కరోజు కార్తీక శుద్ధ ద్వాదశి | – | – | సాయంత్రం | చెరువుమండపం వద్ద స్వామివారికి, శ్రీసీతారాముల ఉత్సవ మూర్తులకు, విష్వక్సేన పుణ్యాహ వచనం చేసి శ్రీస్వామివారి శయన భేరము, ఘంటానాధుని తో సహా పడవపై లోపల గల మండపం వద్ద వేంచేసి ప్రత్యేక ఆరాధన చేసి శ్రీసీతారాములకు నువ్వులపప్పు, బెల్లం నివేదన చేసి అనంతరం చెరువు మండపం వద్ద శ్రీస్వామివారికి హారతి, మంత్రపుష్పం, తీర్థగోష్ఠి చేసి ప్రసాద వినియోగం అనంతరం తిరువీధి ఉత్సవం తదుపరి ఆలయములో నిత్యార్చన. |
| 18. | తిరుమంగైయాళ్వార్ తిరునక్షత్రం | 5 రోజులు | వృశ్చిక సంక్రమణం | కృత్తిక | ఉదయం-రాత్రి | నాలాయిర సేవాకాలం, చివరి రోజు కోయిల్ తిరువాయ్‌మొడి, ఇరామానుశ నూత్తన్దాది, ఉపదేశ రత్నమాల సేవాకాలం, నివేదన, తీర్థగోష్ఠి, ప్రసాద వినియోగం. |



శ్రీ ఉపమాక క్షేత్ర మాహాత్మ్యము

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 19. | ధనుస్సంక్రమణం | 30 రోజులు | ధనుస్సంక్రమణం నుండి | – | ఉదయం | 30రోజులు తిరువీధి, విశేష భోగములు జరుగును. |
| 20. | అధ్యయన ఉత్సవాలు | 10 రోజులు | వైకుంఠ ఏకాదశి నుండి | – | రాత్రి | మొదటి రోజు రంగనాధుని అలంకారంతో సహా ఎనిమిది వాహనాలతో తిరువీధి ఉత్సవం, ఈ ఉత్సవం చూడదగ్గ ఉత్సవం, ఎనిమిది వాహనములలో ఎనిమిది మంది మూర్తులను వేంచేప చేసి తిరువీధి ఉత్సవం జరుపబడును. అనంతరం, నిత్యార్చన, నాలాయిర సేవాకాలముతో 10 రోజులు తిరువీధి ఉత్సవములు అనంతరం తీర్థగోష్ఠి, ప్రసాద వినియోగము. |
| 21. | భోగి పండుగ | ఒక్క రోజు | – | – | ఉదయం | అమ్మవారి పుష్పతోటలో మధ్యాహ్నము గోదాదేవి కళ్యాణం అనంతరం ప్రసాద వినియోగము, తిరువీధి ఉత్సవం, రాజభోగ నివేదన. |
| 22. | సంక్రాంతి | ఒక్కరోజు | – | – | ఉదయం | తిరువీధి, ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం. |
| 23. | కనుమ | ఒక్కరోజు | – | – | సాయంత్రం | రాజాధిరాజు అలంకారంతో శ్రీ స్వామివారి గిరి ప్రదక్షణ అనంతరం చెరువు మండపం |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| | | | | | | వద్ద విష్వక్సేన ఆరాధన, పూజపుణ్యాహ వచనం అనంతరం గజేంద్ర మోక్ష ఘట్టము (కరిమకర సంవాదము) జరుగును. నివేదన, తీర్థ ప్రసాద వినియోగము, తిరువీధి ఉత్సవం, అనంతరం నిత్యారాధన. |
| 24. | రాముని అధ్యయన ఉత్సవాలు | 5 రోజులు | భీష్మ ఏకాదశి నుండి మాఘశుద్ధ ఏకాదశి | | రాత్రి | నాలాయిర సేవాకాలం, చివరి రోజు కోయిల్ తిరువాయ్‌మొడి, ఇరామానుశ నూత్తన్దాది, ఉపదేశ రత్నమాల సేవాకాలం, ఆళ్వారుల పరమపద ఉత్సవం, నివేదన, తీర్థగోష్ఠి, ప్రసాద వినియోగం. |
| 25. | కూరత్తాళ్వార్ తిరు నక్షత్రం | ఒక్కరోజు | మకర సంక్రమణం | హస్త | ఉదయం | కోయిల్ తిరువాయ్‌మొడి, ఇరామానుశ నూత్తన్దాది, ఉపదేశ రత్నమాల సేవాకాలం, నివేదన, తీర్థగోష్ఠి, ప్రసాద వినియోగం. |
| 26. | కులశేఖరాళ్వార్ తిరు నక్షత్రం | ఒక్కరోజు | కుంభ సంక్రమణం | పునర్వసు | ఉదయం | కోయిల్ తిరువాయ్‌మొడి, ఇరామానుశ నూశ్చన్దాది ఉపదేశ రత్నమాల, సేవాకాలం, నివేదన, తీర్థగోష్ఠి, ప్రసాద వినియోగం. |
| 27. | ఉపమాక వేంకటేశ్వర స్వామి వారి వార్షిక కళ్యాణమునకు అంకురార్పణ | ఫాల్గుణ శుద్ధ ఏకాదశి నుండి బ॥చతుర్ధశి వరకు | | ఫాల్గుణ | రాత్రి | దశమి రోజున విష్వక్సేన పూజ, పుణ్యాహ వాచనం, పంచకలశారాధన, ఋత్విక్‌వరుణ, అంతరాలయ దేవతపూజ, మృత్సంగ్రహణం, తిరువీధి, అనంతరం హోమశాలలో అంకురార్పణ అష్టదిక్పాలక ఆవాహన, వాస్తు |





| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| | | | | | | మండప, యోగీశ్వర దేవత, కలశాధిష్టాన దేవత, గరుడపూజ, అగ్నిముఖం, హోమాలు. |
| 28. | శ్రీస్వామి వారి కళ్యాణం | ఒక్కరోజు | – | ఫాల్గుణ శుద్ధ ఏకాదశి | రాత్రి | మధ్యాహ్నం తిరువీధి ఉత్సవం, ధ్వజపట ప్రతిష్ఠ, ప్రసాద వినియోగం జరుగును. స్వామివారికి, అమ్మవారికి ఎదురు సన్నాహ మహోత్సవం, రథోత్సవం, అనంతరం స్వామివారి కళ్యాణం. |
| 29. | సదస్యం | ఒక్కరోజు | – | శుద్ధఏకాదశి | రాత్రి | స్వామివారి కళ్యాణం 3వ రోజున విష్వక్సేన ఆరాధన, మండపారాధన, ఆశీర్వచనం, వేద గోష్ఠి, సేవాకాలం, తీర్థగోష్టి, ప్రసాద వినియోగం. |
| 30. | తోట ఉత్సం | ఒక్కరోజు | – | – | సాయంత్రం | స్వామివారిని తోటకు వాహనముపై తీసుకువెళ్ళి విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనాలు చేసి, ప్రత్యేక ఆరాధన, తీర్థగోష్ఠి, ప్రసాద వినియోగము. అనంతరం తిరువీధి ఉత్సవం. |
| 31. | పూర్ణాహుతి | ఒక్కరోజు | – | – | ఉదయం | అష్టదిక్పాలక విసర్జన, స్వామి వారికి విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, పూర్ణాహుతి, కొట్నాలుసేవ, అద్దపుసేవ, స్వామివారి తిరువీధితో సముద్ర స్నానమునకు (చక్రవారీ స్నానము) వేంచేయుట, తిరు మంజనములు, ప్రత్యేక |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| | | | | | | అర్చన, సేవాకాలం, నివేదన, తీర్థగోష్ఠి, ప్రసాద వినియోగము. అనంతరం కోవెలలో డోలోత్సవము, స్వామి వారి రథోత్సవము, తిరుమంగైయాళ్వార్ తిరువీధి, చోరసంవాదము విన్నపం, అనంతరం గర్భగుడిలో లక్ష్మీసంవాదము - విన్నపము, సేవాకాలం, అనంతరం తీర్థగోష్ఠి, ప్రసాద వినియోగము. |
| 32. | పుష్పాంజలి | 3 రోజులు | - | - | రాత్రి | నిత్యారాధన, సన్నిధిలో అష్టదిక్పాలకుల యదాస్థాన పూజ, ధ్వజ అవరోహణ, ద్వాదశ తిరువారాధన, అనంతరం పవళింపు గదిలో మాణిక్కంకట్టి (ఊంజల్ సేవ) విన్నపముతోటి స్వామి పవళింపు. 2,3 రోజులలో నిత్యారాధన, మాణిక్కంకట్టి, సేవాకాలంలో స్వామి వారి పవళింపు ఉత్సవం. |
| 33. | 16 రోజుల పండుడగ | 1 రోజు | - | - | రాత్రి | నిత్యార్చన, సేవాకాలం అనంతరం అంకు రములతో ఉన్న మొత్తం పాలికలను చెరువు వద్దకు తీసుకువెళ్ళి చెరువులో కలిపి అంకురాళ్ళతో స్వామికి అష్టోత్తరం, నివేదన, అనంతరం తీర్థగోష్ఠి, ప్రసాద వినియోగము. |





# సదుపాయములు / పథకములు / విరాళములు

☛ ఇక్కడ అన్ని సదుపాయములతో 4 విశాలమైన గదులు కలవు. భక్తుల వసతి నామ మాత్రపు అద్దెతో ఇక్కడ కల్పింపబడుతుంది.

☛ దేవస్థానంలో రూ. 150/- లకు రశీదు పొందిన వారికి ఉపనయనం చేసుకొనుటకు అనుమతి లభించును.

☛ దేవస్థానం నుండి రూ. 150/- లకు రశీదు పొందిన వారికి, వారు కోరిన రోజున పెండ్లి చేసుకొనుటకు అనుమతి లభించును.

☛ ఈ క్షేత్రంలో దేవాస్థాన అభివృద్ధి పథకం, అన్నదాన పథకము, గోసంరక్షణా పథకములు కలవు. వీటి నిమిత్తం దాతలు తమ భూరి విరాళములను రూ. 1116/- లు ఆ పై ఎంతైన మొత్తమును స్వయముగా దేవాలయ కార్యనిర్వహణ అధికారి వారికి నగదు రూపంలో చెల్లించి రశీదు పొందగలరు. డి.డి. మరియు యం.ఓ.లు శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానము, ఉపమాక పేరు పై తీసుకొనవలెను. (లేదా) దాతలు క్రింద తెలియ పరిచిన బ్యాంకు ఖాతాలలో జమచేసి, వివరములను దేవస్థానమునకు ఉత్తరమురూపంలో కాని ఈమెయిల్ రూపంలో కాని తెలియపరిచి రశీదు పొందగలరు.

**బ్యాంక్ వివరములు :-** ఇండియన్ ఓవరసీస్ బ్యాంక్, నక్కపల్లి బ్రాంచ్ (సి.బి.యస్.-294), విశాఖపట్టణం జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఇండియా.

**(ఎ) దేవాలయ అభివృద్ధి కొరకు** :- ఎస్.బి. అకౌంట్ నెం. 01, అకౌంట్ పేరు శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానము, ఉపమాక.



**(బి) అన్నదాన పథకముకు కొరకు** :- ఎస్.బి.అకౌంట్ నెం. 99999, అకౌంట్ పేరు శ్రీ వి.ఎస్.టి.టి. నిత్యాన్నదాన పథకం.


**(సి) గో సంరక్షణా పథకము కొరకు** :- ఎస్.బి.అకౌంట్ నెం. 999 గో సంరక్షణా పథకము


☛ ఈ పథకములను విజయవంతముగా నిర్వహించుటకు తోడ్పడవలసిందిగా భక్తులకు మనవి చేస్తున్నాము.

**శ్రీ బేతి కోటేశ్వరరావు**
కార్యనిర్వాహణాధికారి

**శ్రీ కొప్పిశెట్టి కొండబాబు**
ఛైర్మన్



శ్రీశ్రీశ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం - ఉపమాక క్షేత్రం
ఉపమాక గ్రామం, నక్కపల్లి మండలం - 531 081.
విశాఖపట్నం జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఫోన్ : 92476 20111
website : www.upamakabalaji.org.in / com
e-mail : upamakabalaji@gmail.com